



తుళ్లూరు లింగాయపాలెం రీచ్‌లో భారీగా నిల్వ ఉన్న ఇసుక లాట్లు



ఇసుక.. ఐదేళ్లుగా విసిగించింది. ఇసుక అందక భవన నిర్మాణదారులు అష్టకష్టాలు పడ్డారు. ఇసుక లేక పనులు జరగక కూలీలు ఉపాధి కోల్పోయారు. అలాగని ఇసుక తవ్వకాలు జరగలేదా అంటే ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వైసీపీ నేతలు ఇష్టా రీతిన నదీగర్భాలను కుళ్ల బొడి చేశారు. ఇసుకాసురులుగా మారిన నేతలు పర్యావరణ అనుమతులను పట్టించుకోకుండా అధికార యంత్రాంగాన్ని గుప్పిట్లో పెట్టుకుని రూ.కోట్లు బొక్కేశారు. చివరకు కోర్టులను కూడా మాయ చేసి రీచ్‌లను చెరపట్టి ఇసుకను టన్నుల్లో తవ్వి తరలించేశారు. ఒకవైపు స్థానికంగా ఇసుక అందక అల్లాడుతున్నా పాలకులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఇసుకపై దృష్టి సారించింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో బంగారంగా మారిన ఇసుక కష్టాలను తీర్చి ఇకపై పూర్తి స్థాయిలో ఉచితంగా అందుబాటులోకి తేచ్చేలా కూటమి ప్రభుత్వం నూతన విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఇసుక బంగారం కాదు.. అందరికీ అందుబాటులో ఉండేలా చేసింది. ఉచితంగా ఇసుక అందివ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు కసరత్తు చేపట్టారు.

ఇసుక.. ఇక్కట్లకు తెర

ఐదేళ్ల కష్టాలు ఇక తీరినట్లే

- రేపటి నుంచి ఉచిత ఇసుక విధానం
- రీచ్‌లు, స్టాక్‌పాయింట్ల ఖరారుపై కలెక్టర్ల సమీక్ష
- రేపటి నుంచి మొదట వచ్చిన వారికి తొలిగా సరఫరా
- ఒకరికి రోజుకు 20 టన్నులు వరకు పరిమితి

నాడు దోపిడీ.. నేడు పారదర్శకంగా

ప్రకృతి వరప్రసాదమైన ఇసుక బంగారమైంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇసుకను దోచుకున్నారు. సామాన్యుడికి అందుబాటులో లేకుండా చేసి కోట్లు దండుకున్నారు. రీచ్‌ల పేరిట హడావిడి చేసి సామాన్యుడి నెత్తిన పెనుభారం మోపి ప్రభుత్వం చోద్యం చూసింది. ఇసుక దోపిడీ దెబ్బకు మధ్యతరగతి ప్రజలు ఇల్లు కట్టుకుందామన్న ఆలోచననే పక్కన పెట్టేశారంటే పరిస్థితి ఏవిధంగా తెలుసుకోవచ్చు. ఇక భవన నిర్మాణాల మీద ఆధారపడిని వేలాది మంది కార్మికులు పనులు లేక అల్లాడిపోయినా గత ప్రభుత్వం ఇసుక ఇక్కట్లపై దృష్టి సారించలేదు. కష్టనష్టాలకు ఓర్చి, అధిక మొత్తం చెల్లించి ఇసుకను కొనుగోలు చేసిన ఆ మొత్తాలు కూడా వైసీపీ నేతల జేబుల్లోకి చేరాయి తప్పితే ఖజానాకు జమ కాలేదు. ఏ చెల్లింపుల్లోనూ పారదర్శకత లేదు. ఏ రీచ్‌ల దగ్గర ప్రభుత్వ పర్యవేక్షణ లేదు. ఈ పరిస్థితుల్లో పూర్తి పారదర్శకంగా అందరికీ అందుబాటులో ఉండేలా ఇసుక విధానాన్ని కూటమి ప్రభుత్వం సోమవారం నుంచి అమలు చేయనున్నది. నేరుగా నగదు తీసుకునే అవకాశం లేకుండా లోడింగ్ ఛార్జీలను యూపీఐ/ఆన్‌లైన్‌లోనే చెల్లించేలా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇక ఎవరైతే స్టాక్‌యార్డు వద్దకు తొలిగా వస్తారో వారికే ముందు ఇసుకని సరఫరా చేస్తారు. లారీలను సీరియల్‌లో పెట్టించి లోడింగ్ చేయిస్తారు. ఆధార్‌ని ఎంట్రీ చేసుకుని ఒక్కో వ్యక్తికి రోజుకు 20 టన్నుల వరకు ఇసుక మాత్రమే తీసుకెళ్లేందుకు అనుమతిస్తారు. ప్రతీ స్టాక్ పాయింట్ వద్ద సీసీ టీవీ కెమెరాలను అమర్చుతారు. ఉచిత ఇసుక విధానాన్ని దుర్వినియోగపరిచేలా వ్యవహరించే వారిపై జరిమానాలు విధించేందుకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

తప్పు చేస్తే పెనాల్టీల వసూలు

ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే భారీ మొత్తంలో పెనాల్టీలు వసూలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ట్రాక్టర్‌కు తొలిసారి అయితే రూ.10 వేల వరకు, రెండో సారి అయితే రూ.10001 నుంచి రూ.20 వేల వరకు పెనాల్టీ వసూలు చేస్తారు. 10 టైర్ల లారీకి తొలిసారి రూ.25 వేలు, రెండో సారి రూ.25,001 నుంచి రూ.50 వేల వరకు పెనాల్టీ విధిస్తారు. 10 టైర్ల కంటే ఎక్కువ కలిగిన లారీకి తొలిసారి రూ.50 వేలు, రెండోసారి రూ.50001 నుంచి రూ.లక్ష వరకు విధిస్తారు. ఇతర యంత్రాలకు తొలిసారి రూ.50 వేలు, రెండోసారి రూ.50001 నుంచి రూ.లక్ష వరకు పెనాల్టీ ఉంటుంది. ఎద్దుల బండికి తొలిసారి రూ.2 వేలు, రెండోసారి రూ.3 వేలు, ఆ తర్వాత కూడా చేస్తే రూ.5 వేల చొప్పున పెనాల్టీ విధిస్తారు. బిల్లులు ఉండి ఎక్కువ మోతాదులో ఇసుక తరలిస్తే మెట్రిక్ టన్నుకు రూ. 2 వేల పెనాల్టీ వసూలు చేయనున్నారు.

నాడు ఉత్తిత్తి కమిటీలు.. నేడు బాధ్యతాయుతంగా..

వైసీపీ హయాంలో పూర్తిగా నిర్వీర్యమైన జిల్లా స్థాయి కమిటీలు ఇకమీదట క్రమం తప్పకుండా సమావేశమవడంతో పాటు ఉచిత ఇసుక విధానంలో ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించనున్నాయి. ఇదే సమయంలో బ్లాక్‌మార్కెట్‌పై కూడా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలతో ప్రత్యేక దృష్టి పెట్టి అక్రమాలను నియంత్రించేలా ఎక్కడికక్కడ అధికారులు చర్యలు తీసుకోనున్నారు. వైసీపీ పాలనలో ఇసుక అడ్డగోలు దోపిడీని అరికట్టడానికి పకడ్బందీ వ్యవస్థ అంటూ ఏమీలేదు. అన్నింటినీ అలంకారప్రాయంగా మార్చింది. తనిఖీల కోసమంటూ వైసీపీ తీసుకొచ్చిన సెబ్ విధానం అబాసుపాలైంది. రెవెన్యూ, సెబ్ విభాగాలకు సమన్వయం కొరవడడంతో పాటు వాటి మీద వైసీపీ నేతలు ఎక్కిస్వారీ చేయడంతో అవి తన ఉనికిని చాటుకోలేక పోయాయి.

గుంటూరు, బాపట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వంలో ఉచితంగా అందరికీ ఇసుకను అందుబాటులోకి తెచ్చి నిర్మాణరంగాన్ని ప్రోత్సహించగా.. 2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేసింది. దీంతో ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇసుక అందక నిర్మాణదారులు పనులు నిలిపేశారు.. కూలీలు పనులు లేక అలమటించారు. ఇసుకాసురులుగా మారిన వైసీపీ నేతలు రూ.కోట్లు కొట్టేశారు. ఇసుకను బంగారంగా మార్చేశారు. రీచ్‌ల పేరిట హడావిడి చేసి సామాన్యుడి నెత్తిన ఇసుక విషయంలో పెనుభారం మోపి ప్రభుత్వం చోద్యం చూసింది. వారి కష్టాలను పట్టించుకున్న పాపాన పోలేదు. ఐదేళ్ల ఇసుక కష్టాలకు చెక్‌పెడుతూ కూటమి ప్రభుత్వం సోమవారం నుంచి ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చింది. ఈ క్రమంలో ఉచిత ఇసుకకు సంబంధించిన విధివిధానాలపై గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లా యంత్రాంగాలు కసరత్తు ప్రారంభించాయి. శనివారం జిల్లా స్థాయి ఇసుక కమిటీలతో కలెక్టర్లు ఎక్కడికక్కడ సమావేశాలు నిర్వహించారు. మైనింగ్, కృష్ణానది సంరక్షక విభాగం, పోలీసు, రెవెన్యూ, రవాణా తదితర శాఖల అధికారులతో ఆయా జిల్లాల కలెక్టర్లు చర్చించారు. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడెక్కడ ఇసుక స్టాక్ పాయింట్లు ఉన్నాయి, వాటిల్లో ఎన్ని మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉన్నది అనేది తెలుసుకున్నారు. తక్షణమే ఆయా స్టాక్ పాయింట్లను పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఇసుక ధరని ఆదివారం నిర్ణయించి ప్రజలకు తెలియజేసిన అనంతరం సోమవారం నుంచి అందుబాటులోకి తీసుకొద్దామని చెప్పారు. ఆ మేరకు ఆయా శాఖలు ఏర్పాట్లు ప్రారంభించాయి. ఇసుక రవాణా ఛార్జీలను కిలోమీటర్‌కు ఎంత అనేది నిర్ణయం చేయాలని రవాణా శాఖ అధికారులకు కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక లోడింగ్, రవాణా ఛార్జీలు ఎంత అనేది ప్రకటిస్తారు. ప్రస్తుతానికి రీచ్‌ల జోలికి పోకుండా కేవలం స్టాక్‌యార్డుల్లో ఉన్న ఇసుకని ప్రజలకు ఉచితంగా సరఫరా చేయడం పైనే దృష్టి పెట్టాలని అధికారులు నిర్ణయించారు. రెవెన్యూ, పోలీసు, మైనింగ్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉద్యోగులతో బృందాలు ఏర్పాటు చేసి అక్రమంగా ఇసుకని తరలించకుండా చర్యలు చేపట్టనున్నారు. కాగా త్వరలో ఎక్కడెక్కడ ఇసుక పూడిక తొలగించొచ్చు అనేది అధికారులు గుర్తిస్తారు. పట్టా భూముల్లో ఇసుక మేటలు వేసి ఉంటే వాటిని కూడా గుర్తించి అక్కడ ఇసుకని తీసి స్టాక్ పాయింట్ల వద్దకు చేరుస్తారు. వీటి వద్ద నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తారు. ప్రస్తుతానికి ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుకని తీసుకెళ్లేందుకు అనుమతిస్తారు. ఆయా ప్రాంతాల్లో చిన్న కార్యాలయాలు తెరిచి సిబ్బందిని అందుబాటులో ఉంచే అవకాశం ఉంది. పోలీసు, రెవెన్యూ విభాగాలు స్టాక్ పాయింట్ల వద్ద పర్యవేక్షించనున్నాయి. రెండు స్టాక్ పాయింట్లకు ఒకరు చొప్పున మైనింగ్ సిబ్బందిని ఏర్పాటు చేయనున్నారు.

వైసీపీ హయాంలో పూర్తిగా నిర్వీర్యమైన జిల్లా స్థాయి ఇసుక కమిటీలు ఇకమీదట క్రమం తప్పకుండా సమావేశమవడంతో పాటు ఉచిత ఇసుక విధానంలో ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించనున్నారు. ఇదే సమయంలో బ్లాక్‌మార్కెట్‌పై కూడా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలతో ప్రత్యేక దృష్టి పెట్టి అక్రమాలను నియంత్రించనున్నారు. సోమవారం నుంచి కూటమి ప్రభుత్వం తీసుకురానున్న ఉచిత ఇసుక విధానంపై ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సామాన్యుడి సొంతింటికలకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో ఉపకరిస్తుందని, రోజువారీ పనిచేసుకుని బతుకునీడ్చే కార్మికుల ముఖాల్లో కూడా ప్రభుత్వ నిర్ణయంపై ఆనందం కనిపిస్తోంది.

ఆరు చోట్ల స్టాక్ పాయింట్లు

బాపట్ల: జిల్లాలో ఆరు ఇసుక స్టాక్‌పాయింట్ల వద్ద 72,736 మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయానికి సిద్ధంగా ఉందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం శనివారం జరిగింది. బాపట్ల వ్యవసాయ మార్కెటింగ్‌యార్డులోని స్టాక్ పాయింట్‌లో 15,450 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని తెలిపారు. వేటపాలెం జాతీయ రహదారి వద్ద 4,053 మెట్రిక్‌టన్నులు, అద్దంకి మండలం అనమనమూరులో 10,374 మెట్రిక్‌టన్నులు, అద్దంకి తిమ్మాయపాలెంలో 5,103 మెట్రిక్‌టన్నులు, మార్టూరులో 2,897 మెట్రిక్‌టన్నులు, కొల్లూరు మండలం జువ్వలపాలెంలో 34,859 మెట్రిక్‌టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద లోడింగ్‌కు టన్నుకు రూ.20 ధరను ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇసుకకు సంబంధించి మండల స్థాయిలో ప్రత్యేక బృందాలను నియమిస్తామన్నారు. సోమవారం ఉదయం 6 గంటలు నుంచి ఇసుక ఉచితంగా అందిస్తామన్నారు. రేవుల వద్ద లోడింగ్, ప్రయాణ ఖర్చులు మాత్రమే ఉంటాయన్నారు. ఇసుక సమాచారాన్ని మైన్స్ అండ్ జియాలజి వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. వినియోగదారులు ఆధార్, ఇతర ధ్రువీకరణపత్రాలు చూపి ఇసుక తీసుకోవచ్చన్నారు. వినియోగదారులకు ఎలాంటి సమస్యలు రాకుండా నిర్మాణదారులకు భారంలేకుండా ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఇసుక అక్రమాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నల్లబజారులో ఇసుక అక్రమ విక్రయాలను అరికట్టాలన్నారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే అధికారులు చర్యలు తీసుకోవాలని లేకుంటే అధికారులే బాధ్యులౌతారన్నారు. సచివాలయ సిబ్బందితో ఒకరిని స్టాక్ పాయింట్ వద్ద నియమించాలన్నారు. 24 గంటలపాటు పోలీసులు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్, డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, గనులశాఖ ఏడీ రాజేష్, డీపీవో సురేష్, రవికుమార్, ఆర్డీవోలు, డీఎస్పీలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



ఇసుక నూతన విధానంపై అధికారులతో సమావేశమైన కలెక్టర్ వెంకటమురళీ

రాజధానిలో ఇసుక కొండలు

- రీచ్‌లను పరిశీలించిన అధికారులు

తుళ్లూరు: రాజధాని పరిధిలోని గ్రామాల్లో అధికారులు ఇసుక కొండలను గుర్తించారు. మండల పరిధిలోని రాయపూడి, లింగాయపాలెం, తాళ్లాయపాలెం ఇసుక రీచ్‌లను అధికారులు శనివారం పరిశీలించారు. ఆయా రీచ్‌ల్లో ఉన్న నిల్వలను పరిశీలించారు. రాయపూడి రీచ్‌లో నీటి నుంచి ఇసుక తీసే అవకాశాలున్నాయని, మేటలు కూడా ఉన్నాయని అధికారులు గుర్తించారు. లింగాయపాలెంలో డ్రెడ్జింగ్ చేసి నిల్వ వేసిన నాలుగు భారీ ఇసుక లాట్లను పరిశీలించారు. తాళ్లాయపాలెం పుష్కరఘాట్ వద్ద డంప్ చేసిన ఇసుకను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దారు సుధీర్, ఎంపీడీవో శివన్నారాయణ, సర్వేయర్ రామాంజనేయులు, ఆర్ఐ భవానీకిరణ్, తుళ్లూరు సీఐ-2 అనురాధ, ఎస్ఐ అంకమ్మ, ఎస్ఈబీ సీఐ ప్రసన్నలక్ష్మి, ఎస్ఐ రాజేంద్ర, వీఆర్వో కోటేశ్వరావు తదితులున్నారు.

బాపట్ల వ్యవసాయ మార్కెట్ యార్డులోని స్టాక్‌పాయింట్‌లో ఉన్న ఇసుక నిల్వ





లింగాయపాలెం రీచ్‌లో నిల్వ ఉంచిన ఇసుక డంప్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుధీర్ , ఎంపిడివో సర్వే, ఎస్ఈబి అధికారులు

పీహెచ్‌డీ.. రూ.10 లక్షలు

- ఏఎన్‌యూలో పట్టాలు, పదవుల అమ్మకం
- స్కాలర్స్ నుంచి వైవాకు రూ.వేలల్లో వసూలు
- వైసీపీ వారికే పదవులు.. అక్రమాలపై ప్రశ్నిస్తే దాడులు

చదివితే కాదు.. పైసలతో డిగ్రీలు

గుంటూరు(విద్య), జూలై 6: విద్యకు ఆలయంగా ఉండాల్సిన వర్సిటీలు వైసీపీ హయాంలో అక్రమాలకు అడ్డాగా మారాయి. పైసలు, వైసీపీ నేతల అండతోనే పదవులతో పాటు డిగ్రీలు కూడా పంపిణీ చేశారు. సాధారణంగా పీహెచ్‌డీ రావాలంటే ఏళ్లుగా ఆ అంశంపై పరిశోధనలు చేసి.. అందులో నిష్ణాతులుగా మారి.. వివిధ పరీక్షలు ఎదుర్కొని.. తమ మేధస్సుతో పలువుర్ని మెప్పించాలి. కానీ వైసీపీ హయాంలో అలాంటి వాటితో సంబంధం లేకుండానే యథేచ్ఛగా పీహెచ్‌డీల ప్రదానం జరిగింది. ఈ కోవలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కూడా చేరినట్లు విమర్శలు, ఆరోపణలున్నాయి. నాగార్జున విశ్వవిద్యాలయం ఎడ్యుకేషన్ విభాగంలో రోజుకో కొత్త దందా వెలుగు చూస్తోంది. పీహెచ్‌డీ కోసం వచ్చే దరఖాస్తుదారులు వర్సిటీకి రూ.వేలల్లో ఫీజులతో పాటు గైడ్లకు లక్షలు ముట్టచెప్పినట్లు పలువురు స్కాలర్లు వాపోతున్నారు. కొంతమంది గైడ్‌లు థీసెస్ రాయించడానికి స్కాలర్స్ నుంచి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేశారని సమాచారం. కొంతమంది గైడ్లు తాము చెప్పిన వారి దగ్గరే థీసెస్ రాయించమని స్కాలర్స్‌పై ఒత్తిడి తెచ్చి 50 శాతం తీసుకున్నట్లు సమాచారం. మరికొందరు థీసెస్ మీద సంతకాలకు రూ.3 లక్షల వరకు వసూలు చేశారని స్కాలర్స్ ఆవేదన. ఎడ్యుకేషన్ విభాగంలో ఓ అధికారికి రూ.10 వేలు ఇస్తేకానీ వైవాలో ప్రశ్నలు అడగరని ప్రచారం ఉంది. మరో అధికారి కారు ఛార్జీలు, మూడు నక్షత్రాల హోటల్‌లో విందులంటూ స్కాలర్స్‌ను పిండేశారు. మరికొందరు వైవాకు హాజరు కావాలంటే రూ.20 వేలు ఇవ్వాలని హుకుం జారీ చేస్తు న్నారు. సెమినార్స్ సందర్భంగా రూ.5 వేల నుంచి రూ.25 వేలు దండుకుంటున్నారు. ఇలా వర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందాలంటే రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చవుతున్నట్లు స్కాలర్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వీర విధేయులకే పదవులు..

వర్సిటీ ఎడ్యుకేషన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో ఒక్కరు తప్ప మిగతా అందరూ వైసీపీకి వీర విధేయులే అనే ప్రచారం ఉంది. టీడీపీ వారికి పదవులు ఇవ్వొద్దని ఓ మాజీ అధికారిణి వీసీకి లేఖ ఇచ్చినట్లు సమాచారం. మాజీ మంత్రి అండతో మరో అధికారిణి ప్రతి పనికి రేటు కట్టి వసూళ్లకు తెగబడుతున్నట్లు ఆరోపణ ఉన్నాయి. గతంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లను బహిరంగంగా విమర్శించడం తోనే ఈమెకు పదవి దక్కినట్లు ప్రచారం.

అక్రమాలు ప్రశ్నిస్తే వేధింపులే..

ఎడ్యుకేషన్ విభాగంలో జరిగే అక్రమాలను పశ్నిస్తే వేధింపులకు గురిచేస్తున్నారని స్కాలర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమందిపై అక్రమంగా కేసులు కూడా బనాయించారు. ఓ అధ్యాపకుడిపై అట్రాసిటీ కేసు పెడితేనే మీ బంధువుకు పీహెచ్‌డీ వస్తుందని డీఎస్పీ స్థాయి అధికారిని ఓ గైడ్ బెదిరించినట్లు సమాచారం. కుల సంఘాల నేతలతో దాడులు సర్వసాధారణమయ్యాయని స్కాలర్స్ వాపోతున్నారు.

సోలార్ ప్లాంట్లకు ప్రోత్సాహం

- విద్యుత్ వ్యవస్థలను నాశనం చేసిన వైసీపీ
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, జూలై 6: కేంద్ర ప్రభుత్వ సహకారంతో సోలార్ ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకి మున్సిపాలిటీలో అధికారులతో శనివారం మంత్రి సమీక్షించారు. అనంతరం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ఆసక్తి చూపితే ప్రైవేటు భవనాలపై కూడా సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కేరళలో సోలార్ ప్లాంట్లు బాగా ఏర్పాటు చేశారన్నారు. టీడీపీ హయంలో ప్రజలకు మేలు జరిగే సంస్కరణలతో మిగులు విద్యుత్‌ను ఉత్పత్తి చేయగా వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ వ్యవస్థలను సర్వనాశనం చేసిందన్నారు. అన్నింటినీ ప్రక్షాళన చేసి ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించటమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో కొత్తగా 46వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తామన్నారు. అవినీతి అధికారులను ఉపేక్షించేది లేదని మంత్రి హెచ్చరించారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి గొట్టిపాటి

ఎవరీ బాలు.. ఎందుకా ప్రాధాన్యం

- టీడీపీ నేతపై దాడి.. టీడీపీ అధిష్ఠానం ఆరా



బాధితుడు నక్కల రమణారావు

చీరాల, జూలై 6: చీరాలలో బాలూ యాదవ్ అనే కానిస్టేబుల్ ఏకంగా పార్టీ కార్యాలయంలోకి ప్రవేశించి సీనియర్ నేత నక్కల రమణారావుపై దాడి చేయడంపై అధిష్ఠానం ఆరా తీస్తుంది. ఎవరీ బాలూయాదవ్.. అతడికి ఎందుకు నేతలు ప్రాధాన్యం ఇస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. టీడీపీలోని మిగిలిన నేతలకు కూడా ఈ బాలు విషయం అంతుబట్టడంలేదు. టీడీపీ కార్యాలయంలో మూడు రోజుల క్రితం రమణారావుపై బాలు అనే కానిస్టేబుల్, మరో ఆరుగురుతో కలిసి దాడి చేయడం సంచలనంగా మారింది. సాక్షాత్తు టీడీపీ కార్యాలయంలో సీనియర్ నేతపైనే దాడి చేయడం దేనికి సంకేతమని ప్రజల్లో జోరుగా చర్చ సాగుతోంది. సామాజికంగా, ఆర్థికంగా బలమైన రమణారావు లాంటిపై వ్యక్తిపైనే దాడి జరిగితే తమ పరిస్థితి ఏమిటని పార్టీకి తొలి నుంచీ వెన్నుదన్నుగా ఉన్న నాయకులు ఆందోళన చెందుతున్నారు.

కానిస్టేబుల్‌పై చర్యలు

దాడిలో గాయపడిన బాధితుడు రమణారావు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కానిస్టేబుల్ బాలు యాదవ్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. జరిగిన పరిణామాలను పరిశీలించిన ఎస్పీ వకుల్‌జిందాల్ సదరు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు.

అందర్నీ కడుపుబ్బా నవ్వించే డార్లింగ్



నిర్మాతలుగా 'హను-మాన్' చిత్రంతో సూపర్‌హిట్ అందుకున్నారు కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య. లేటెస్ట్‌గా ప్రియదర్శి, నభానటేశ్ జంటగా రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ 'డార్లింగ్' చిత్రాన్ని నిర్మించారు. 'వై దిస్ కొలవెరి' అనేది ఉప శీర్షిక. అశ్విన్ రామ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత చైతన్య మీడియాతో చిత్ర విశేషాలను పంచుకున్నారు.

'కపుల్స్ మధ్య జరిగే సంఘటనలని వినోదాత్మకంగా చూపించే ప్రయత్నమే ఈ సినిమా. యూత్, ఫ్యామిలీ ఇలా..ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకునేలా సినిమాను దర్శకుడు తీర్చిదిద్దారు. ఇందులో కథానాయకుడి పాత్ర చాలా అమాయకంగా.. కథానాయిక పాత్ర చలాకీగా ఉండాలి. ఈ పాత్రలకి ప్రియదర్శి, నభానటేశ్ సరిపోతారని అనిపించి వారిని తీసుకున్నాం. సినిమాలో ఇద్దరి క్యారెక్టర్లకీ సమ ప్రాధాన్యత ఉంటుంది. వినోదంతో పాటు భావోద్వేగాలని సమపాళ్లలో మిక్స్ చేసి తీసిన ఈ సినిమాలో.. హీరో హీరోయిన్ల మధ్యన వచ్చే సన్నివేశాలు అందరినీ కడుపుబ్బా నవ్విస్తాయి. వివేక్ సాగర్ సంగీతం సినిమాకు స్పెషల్ హైలైట్. 'హను-మాన్'కు సీక్వెల్‌గా వస్తున్న 'జై హనుమాన్' సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉంది. ఈ సినిమాలో హనుమంతుడి పాత్రలో ఎవరు నటిస్తారనేది మాత్రం సస్పెన్స్" అని చెప్పారు.

అనాథలే స్టార్స్

సంజయ్ శ్రీరాజ్‌ను హీరోగా, ప్రియా శ్రీనివాస్ హీరోయిన్‌గా నటించిన 'గల్లీ గ్యాంగ్ స్టార్స్' చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సినిమా గురించి దర్శకుడు ధర్మ మాట్లాడుతూ 'నెల్లూరులో చిత్రాన్ని నిర్మించాం. ఓ గల్లీలో నివసించే అనాథలు ఎదుర్కొనే సమస్యలను



చిత్రంలో వివరించాం' అని చెప్పారు. చిత్ర నిర్మాత డాక్టర్ అరవేటి యశోవర్ధన్ మాట్లాడుతూ 'క్రైమ్ డ్రామా చుట్టూ చిత్రకథ నడుస్తుంది. ఇందులో నాలుగు పాత్రలు ప్రముఖంగా ఉంటాయి. అనాథలైన వారి జీవితాలు ఎలా ఎవరి వల్ల మలుపు తిరిగిందో చూపించాం. మాస్ ఆడియన్స్‌కు నచ్చేసినిమా ఇది' అని చెప్పారు.

దర్శకధీరుడిపై డాక్యుమెంటరీ



దర్శకధీరుడు రాజమౌళిపై ఓ డాక్యుమెంటరీ తెరకెక్కుతోంది. రాఘవ్ ఖన్నా దర్శకత్వంలో 'ద మోడరన్ మాస్టర్స్' పేరుతో ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ డాక్యుమెంటరీని నిర్మిస్తోంది. ఆగస్టు 2న ఇది విడుదల కానుంది. దర్శకుడిగా రాజమౌళి ప్రయాణాన్ని.. ఆయన ఇండియన్ సినిమాపై చూపిన ప్రభావాన్ని ఇందులో చూపించనున్నారు. ఈ డాక్యుమెంటరీలో రాజమౌళి గురించి ఆయన బంధుమిత్రులు, దర్శకులు జేమ్స్ కామెరూన్, రుస్సో బ్రదర్స్, హీరోలు రానా, ప్రభాస్ తమ అభిప్రాయాలను తెలియజేయనున్నారు.

బడ్డీ హార్ట్ టచింగ్ సాంగ్



అల్లు శిరీష్ నటించిన తాజా చిత్రం 'బడ్డీ' ఈ నెల 26న విడుదల కానుంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని జ్ఞానవేల్ రాజా, అధన నిర్మిస్తున్నారు. శామ్ ఆంటోన్ దర్శకుడు. ఈ సినిమా నుంచి 'చూసాలే నాలో నీ కలనే.. దాచాలే దాచాలే నాలో ఆ కలనే' అంటూ సాగే ఈ హార్ట్ టచింగ్ సాంగ్‌ను సాయి హేమంత్ రాశారు. సంగీత దర్శకుడు హిప్ హాప్ తమిళ స్వరపరిచి ఐరా ఉడిపితో కలసి పాడారు. గాయత్రి భరద్వాజ్, అజ్మల్, అమీర్, ప్రిషా రాజేశ్ సింగ్, ముఖేశ్‌కుమార్ తదితరులు నటించిన ఈ చిత్రానికి నేహ జ్ఞానవేల్ రాజా సహ నిర్మాత.

ఆధారాలు సమర్పించండి..



హీరో రాజ్‌తరుణ్‌పై ఫిర్యాదు చేసిన మహిళకు నోటీసులు

సినీ హీరో రాజ్‌తరుణ్ తనను మోసగించాడంటూ ఫిర్యాదు చేసిన లావణ్య అనే మహిళకు నార్సింగ్ పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఆమె ఫిర్యాదులో పేర్కొన్న అంశాలకు సంబంధించిన ఆధారాలను విచారణ నిమిత్తం తమకు సమర్పించాలని నోటీసులో పేర్కొన్నారు. లావణ్య ఆధారాలు సమర్పిస్తేనే ఈ కేసు దర్యాప్తులో పురోగతి ఉంటుంది. లేదంటే కోర్టు అనుమతితో పోలీసులు కేసును చట్ట ప్రకారం మూసివేస్తారు.

శేఖర్ కమ్ముల చేతుల మీదుగా...



సాయితేజ కల్వకోట, పావని కరణమ్ జంటగా నటిస్తున్న చిత్రం 'పైలం పిలగా'. తెలంగాణ నేపథ్యంలో సాగే ఈ హాస్యభరిత వ్యంగ్య చిత్రాన్ని యాడ్ ఫిల్మ్‌మేకర్ ఆనంద్ గుర్రం దర్శకత్వంలో రామకృష్ణ బొదుల నిర్మించారు.శుక్రవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'సోదు సోదు' పాటను డైరెక్టర్ శేఖర్ కమ్ముల లాంచ్ చేశారు. ఈ సందర్భంగా శేఖర్ కమ్ముల మాట్లాడుతూ 'ఈ పాటకు మంచి సాహిత్యంతో పాటు ఆకట్టుకునే సంగీతం తోడైంది' అని చెప్పారు. 'పూర్తి స్థాయి కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రమిది" అని నిర్మాత రామకృష్ణ బొదుల తెలిపారు. ఈ పాటకు ఆనంద్ గుర్రం, అక్కల చంద్రమౌళి సాహిత్యం అందించగా, యశ్వంత్ నాగ్‌నారు సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: రవితేజ కుర్మన, డీఓపీ: సందీప్ బొద్దుల.

దిక్సూచి

ఇంజనీరింగ్ వెబ్ కౌన్సెలింగ్ జాగ్రత్తలు

తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించినకౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. టీజీఈఏపీ సెట్/ఏపీ ఈఏపీ సెట్‌లో మంచి ర్యాంక్ వస్తే ఇబ్బంది ఏమీ లేదు. కోరుకున్న కాలేజీలో, అనుకున్న బ్రాంచీలో సులువుగా సీటు పొందవచ్చు. మధ్యస్థంగా ర్యాంకు వచ్చిన అభ్యర్థులకే కొన్ని ఇబ్బందులు ఉంటాయి. ఎలా చేస్తే, మంచి కాలేజీలో, కోరుకున్న బ్రాంచీలో సీటు వస్తుందన్నది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఎదురయ్యే ప్రశ్న. ఈ విషయంలో నిపుణుల మాటేమిటో చూద్దాం.



ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ మొదలైనప్పుడు ఇరవై నుంచి ముప్పయ్ ఆప్షన్లు పెట్టుకుంటే చాలు అని ఎక్కువమంది విద్యార్థులు అనుకుంటారు. అయితే అది తప్పని కౌన్సెలింగ్ నిర్వాహకులు పదేపదే చెబుతున్నారు. నిజానికి వందల కొద్దీ ఆప్షన్లు పెట్టుకునే అవకాశం ఉంది. అలాంటప్పుడు కేవలం కొన్ని ఆప్షన్లు మాత్రమే పెట్టుకుంటే, నష్టం జరిగే అవకాశమే ఎక్కువ. ముఖ్యంగా పెద్ద సంఖ్యలో ర్యాంకు వచ్చినప్పుడు విద్యార్థులు కనీసం రెండు, మూడు వందలు, వీలైతే అంతకన్నా ఎక్కువ ఆప్షన్లు పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. తప్పకుండా వస్తాయన్న వాటికితోడు, అటూ ఇటూగా రావడానికి అవకాశం బాగా ఉన్న కాలేజీలు, బ్రాంచీలను కూడా ఎంచుకోవాలి. ప్రత్యేకించి మనకు రాదనుకున్న బ్రాంచ్ లేదా కాలేజీకి ఎవరూ ఆప్షన్ పెట్టుకోని పక్షంలో పరిస్థితి అనుకూలిస్తే మనకే దక్కవచ్చు.

అవకాశం ఒక్కసారే: ర్యాంక్ పెద్ద సంఖ్యలో వచ్చినప్పటికీ మంచి కాలేజీలు, కోర్సుల విషయంలో రాజీ పడాల్సిన పని లేదు. మనకు నచ్చిన కాలేజీ లేదంటే కోర్సు నుంచి ఆప్షన్లు ఆరంభించవచ్చు. ర్యాంకుల ఆధారంగా మాత్రమే సీట్ల కేటాయింపు ఉంటుంది. అంటే మొదటి ర్యాంక్ తరవాత రెండో ర్యాంక్ క్యాండిడేట్ ఇచ్చుకున్న ఆప్షన్ల ఆధారంగా అలాట్‌మెంట్ ఉంటుంది. ఉదాహరణకు వందో ర్యాంక్ వచ్చిన అభ్యర్థి ప్రత్యేకించి నచ్చిన కాలేజీలను తనిష్టం వచ్చిన రీతిలో పెట్టుకున్నాడని అనుకుందాం. ఆ అభ్యర్థికి ఆర్డర్ ఆఫ్ మెరిట్ ప్రకారం సీటు కేటాయింపు జరుగుతుంది. అంటే ఆ వ్యక్తిని వందో అభ్యర్థిగా పరిగణిస్తుంది. తనకు ముందున్న 99 మందికి సీట్ల కేటాయింపు పూర్తయ్యాక ఇతని వంతు వస్తుంది. అప్పుడు సీటు కేటాయింపు ఆ వ్యక్తి పెట్టుకున్న మొదటి ఆప్షన్ నుంచి ఆరంభమవుతుంది. ఆప్షన్ నెంబర్ 1, 2, 3.. అలా మొదలవుతుంది. ఆప్షన్ 30 దగ్గర క్లిక్ కావచ్చు. లేదంటే 200 వద్ద క్లిక్ కావచ్చు. ఆ ఆప్షన్‌గా పెట్టుకున్న కాలేజీ, కోర్సులో సీటు లభిస్తుంది. వందో వ్యక్తిగా మాత్రమే ఆ అభ్యర్థికి కేటాయింపు ఆరంభమవుతుంది. ముఖ్యంగా ఈ వెబ్ కౌన్సెలింగ్‌లో గరిష్ఠంగా ఆప్షన్లకు అవకాశం ఇవ్వడం అందుకోసమేనని గుర్తించాలి. అసలు ఒక్కరూ ఆప్షన్ పెట్టుకోనందున కొన్ని సీట్లు మిగిలిపోయాయని చెబుతూ ఉంటారు. అలాగే ఒక్కరు కూడా చేరని కాలేజీలు లేదా బ్రాంచీల వివరాలను కౌన్సెలింగ్ నిర్వాహకులు అధికారికంగానే ప్రకటిస్తుంటారు. ఆ కాలేజీలు లేదా ఆ గ్రూపులు కొన్ని అంత డిమాండ్ లేనివి కావచ్చు. అలాగే డిమాండ్ ఉన్నప్పటికి రాదని కొందరు ఆప్షన్లుగా ఇచ్చుకుని ఉండకపోవచ్చు. కారణం ఏమైనా ఆ సీట్లు మొదటి రౌండ్‌లో మిగిలిపోయాయన్నది వాస్తవం.

మొదటి అవకాశమే మంచిది: ఇలాంటి వెబ్ కౌన్సెలింగ్‌లో తొలి ఎంపికే కీలకం. రెండోసారి కౌన్సెలింగ్‌కు అవకాశం ఇచ్చినప్పటికీ, అప్పుడు ఛాన్స్‌లు తక్కువ. కేవలం మిగిలిన సీట్లకు మాత్రమే పోటీపడాల్సి వస్తుంది. అందువల్ల మొదటి కౌన్సెలింగ్ సమయంలోనే కొద్దిగా తెలివిగా వ్యవహరించాలి.

లాస్ట్ ఇయర్ కటాఫ్ చూడాలి: కాలేజీలు, సీట్లవారీగా గత ఏడాది కేటాయింపు సమాచారం చూస్తే మంచిది. అయితే ఇది కేవలం గైడింగ్ ఫ్యాక్టర్ మాత్రమే. ఈ ఏడాది కూడా అదే మాదిరిగా కేటాయింపు జరగాలని లేదు. ప్రత్యేకించి ప్రసిద్ధ కాలేజీల్లో మాత్రం ర్యాంకింగ్‌లో కొద్దిగా అటూ ఇటూగా మాత్రమే మారుతుంది.



ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు
రాయపూర్ ఎన్ఐటి డైరెక్టర్

ఆంధ్రప్రదేశ్
ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 7 వరకు
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 10 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 8 నుంచి 12
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 13
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 16
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 17 - 22
- **తరగతులు ప్రారంభం:** జూలై 19 నుంచి
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in/

తెలంగాణ
ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 12 వరకు
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 6 నుంచి 13 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 8 నుంచి 15 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 15
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 19
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 19 - 23
- **వెబ్‌సైట్:** tgeapcet.nic.in

జయశంకర్ వర్సిటీలో పాలిసెట్ ప్రవేశాలు

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)- వ్యవసాయ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. తెలంగాణ పాలిసెట్ 2024 (అగ్రికల్చర్ స్ట్రీమ్) ర్యాంక్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలల్లో 260 సీట్లు, అనుబంధ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో 540 సీట్లు ఉన్నాయి. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివిన విద్యార్థులకు ప్రతి ప్రోగ్రామ్‌లో 60 శాతం సీట్లు కేటాయించారు. ఇప్పటికే ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు షెడ్యూల్ ప్రకారం కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి.

కౌన్సెలింగ్ షెడ్యూల్: తెలంగాణ పాలిసెట్ 2024(అగ్రికల్చర్ స్ట్రీమ్)లో 447 నుంచి 19998 మధ్య ర్యాంక్‌లు సాధించినవారు జూలై 10న, 20015 నుంచి 46924 మధ్య ర్యాంక్‌లు సాధించినవారు జూలై 11న, 47062 నుంచి 68151 మధ్య ర్యాంక్‌లు సాధించినవారు జూలై 12న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. కౌన్సెలింగ్ ప్రక్రియ ఉదయం తొమ్మిదిన్నరకు ప్రారంభమౌతుంది.

- **కౌన్సెలింగ్ వేదిక:** యూనివర్సిటీ ఆడిటోరియం, పీజేటీఎస్ఏయూ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్
- **ఎంపికైన అభ్యర్థులు చెల్లించాల్సిన ఫస్ట్ సెమిస్టర్ ఫీజు:** యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలల్లో రూ.19,460; ప్రైవేట్ అనుబంధ కళాశాలల్లో రూ.22,210.
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/r1mnRyKలో చదవండి.

రాజధానిలో జంగిల్ క్లియరెన్స్‌కు సీఆర్‌డీఏ టెండర్లు

● ఈ వారంలో పనులు ప్రారంభం ● నెల రోజుల వ్యవధిలో పూర్తి చేయాలి

తుళ్లూరు, జూలై 6: ప్రజారాజధానిగా ప్రపంచస్థాయిలో గుర్తుండిపోవాల్సిన అమరావతిని సీఎం జగన్ రెడ్డి మూడు రాజధానులని అక్కడి నిర్మాణాలను పాడుబెట్టాడు. రైతులిచ్చిన భూముల్లో ప్లాట్లను అభివృద్ధి చేయాల్సి ఉండగా అడవిని చేశాడు. ఇప్పుడు దానిని క్లియర్ చేయాటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ముందు జంగిల్ క్లియరెన్స్ చేస్తే ఎక్కడ నుంచి పనులు మొదలు పెట్టాలో అర్థమవుతుందని ఇటీవల రాజధానిలో పర్యటించినప్పుడు ఆయన అన్నారు. వెంటనే సీఆర్డీఏ అధికారులు రాజధానిలో ముఖ్యమైన రోడ్ల పక్కన అలుముకున్న ముళ్లకంపను తొలగించారు. ఈ తరువాత రాజధానిలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేయటానికి టెండర్లు పిలిచారు. మొత్తం రాజధాని 29 రెవెన్యూ గ్రామాల్లో 26 వేల ఎకరాల్లో కంప తొలగించే ప్రక్రియ వారం రోజుల్లో ప్రారంభం కానుంది. అందుకు 30 కోట్లకు టెండర్లు ఆహ్వానించారు. పెద్దపెద్ద కంపెనీలే టెండర్లు దక్కించుకోనున్నాయి. 30 రోజుల్లో జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేయాలని గడువు విధించారు. రైతుల ప్లాట్లలో రోడ్లను కూడా పూర్తి చేయటానికి జంగిల్ క్లియరెన్స్ అనేది ప్రధానంగా ఉంది. ఆ పనులు పూర్తయితే రైతుల ప్లాట్లలో అభివృద్ధి పనులు చేయటానికి సీఆర్డీఏ సన్నాహకాలు చేసుకుంటుంది. వైసీపీ ప్రభుత్వంలో పారద్రోలిన నిర్మాణ కంపెనీలను పిలిచి అభివృద్ధి పనులు వేగవంతం చేయించటానికి సీఆర్డీఏ అధికారులు కసరత్తు చేస్తున్నారు.



సైనికుడు షేక్ రజ్జుబాషాకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఆర్మీ అధికారులు తదితరులు

సైనిక లాంఛనాలతో బాషా అంత్యక్రియలు

బాపట్ల, జూలై 6 : పట్టణంలోని భావపురి కాలనీకి చెందిన షేక్ రజ్జుబాషా జమ్ముకాశ్మీర్‌లో హవల్దార్‌గా పనిచేస్తూ గుండెపోటుతో మరణించాడు. మృతదేహాన్ని శుక్రవారం అర్ధరాత్రి తర్వాత బాపట్లకు తీసుకొచ్చి శనివారం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. భావపురికాలనీ నుంచి ఇస్లాంపేట ఈద్గా వరకు బాషా భౌతికకాయానికి అంతిమ యాత్ర నిర్వహించారు. అంతిమయాత్రలో అధికారులు, సైనికులు, మాజీ సైనికులతోపాటు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పార్టీశ్రేణులతో కలిసి పాల్గొన్నారు. బాషా భౌతికకాయంపై పుష్పాంజలి ఘటించారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పంపిన ప్రత్యేకమైన రీత్ (పూలమాల)ను మిలటరీ అధికారి కెప్టెన్ దీపక్‌సింగ్, ఆర్డీవో గంధం రవీందర్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసర్ గుణశీలాషహీద్, మాజీ సైనిక సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు తదితరులు రజ్జుబాషా భౌతికకాయం వద్ద జోహార్లు అర్పించారు. అధికారులు, నాయకులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

కౌలురైతు ఆత్మహత్య



ర్యాలీ పేరయ్య (ఫైల్‌ఫొటో)

బాపట్ల, జూలై 6: అప్పుల బాధతాళలేక కౌలురైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బాపట్ల మండలం భర్తీపూడి గ్రామంలో జరిగింది. ఏడెకరాల పొలం కౌలుకు తీసుకొని సాగుచేస్తూ జీవనం సాగిస్తున్న రైతు ర్యాలీ పేరయ్య (64)కు వ్యవసాయంలో నష్టం వచ్చింది. అప్పులు సుమారు పది లక్షలకు పెరిగిపోయాయి. చేసేదిలేక శుక్రవారం రాత్రి మద్యంలో పురుగుమందు కలుపుకొని తాగాడు. స్థానికులు గుర్తించి పొన్నూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శనివారం తెల్లవారుజామున ఆయన మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. భౌతికకాయాన్ని వ్యవసాయశాఖ జేడీ కె.రామకృష్ణ, మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్, గ్రామసర్పంచ్ అచంట అమరేష్, రూరల్ సీఐ శ్రీహరి, ఈవోపీఆర్డీ పులి శ్రీనివాసరావు తదితరులు సందర్శించి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు.

మాజీ మంత్రి రజినీపై పోలీసులకు ఫిర్యాదు

చిలకలూరిపేట, జూలై 6 : చిలకలూరిపేట మండలంలోని పసుమర్రు గ్రామానికి చెందిన శ్రీరామ్ వెంకటేశ్వరరావు అనే వ్యక్తి మాజీ మంత్రి విడదల రజినీ, ఆమె అనుచరులు తన పొలాన్ని కబ్జా చేశారని శనివారం చిలకలూరిపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పొలం తనకు ఇప్పించాలని ఆయన ఫిర్యాదులో పోలీసులను అభ్యర్థించారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం 1987లో తన తండ్రి పసుమర్రు గ్రామ శివారులో ఎకరం పొలం కొన్నారని, అప్పటి నుంచి ఆ పొలం తన ఆధీనంలో ఉన్నదని తెలిపారు. ఆ పొలాన్ని యూనియన్ బ్యాంక్‌లో తనఖా పెట్టి రుణం కూడా తీసుకున్నానని వివరించారు. అయితే తన పొలాన్ని వేరే వారికి రజినీ, ఆమె అనుచరులు తప్పుడు రిజిస్ట్రేషన్‌లు చేశారని ఆయన ఆరోపించారు. ఇందుకు సంబంధించి తనకు ఎటువంటి డబ్బు కూడా చెల్లించలేదని పేర్కొన్నారు. ఈ విషయం బయటకు చెబితే తనను చంపుతామని బెదిరించినట్టు తెలిపారు. తన పట్టాదారు పాసుపుస్తకాలు రద్దు చేయకుండా హైకోర్టు నుంచి తాను స్టే కూడా తెచ్చుకున్నట్లుగా వివరించారు. ఈ విషయాలను తాను ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుల దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. పోలీసులు తనకు న్యాయం చేస్తారన్న నమ్మకంతో ఫిర్యాదు చేస్తున్నట్టు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా : ఒకరి మృతి

నూజెండ్ల, జూలై 6 : ఇసుక ట్రాక్టర్ బోల్తా పడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని తలార్లపల్లి సమీపంలో శనివారం జరిగింది. గుర్రపునాయుడుపాలెం గ్రామానికి చెందిన బొల్లినేని హనుమంతరావు(50) ఇటీవల కొత్తగా ట్రాక్టర్ కొనుక్కొని ఉదయాన్నే ములకలూరు వెళ్ళి గుండ్లకమ్మ నది నుంచి ఇసుక పోసుకొని గుర్రపునాయుడుపాలెం గ్రామానికి తిరిగి వస్తున్న సందర్భంలో అదుపు తప్పి రోడ్డు పక్కన తిరగబడటంతో ట్రాక్టర్ నుడుపుతున్న హనుమంతరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఐనవోలు ఎస్‌ఐ ఎం లక్ష్మీనారాయణరెడ్డి పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భార్యను కడతేర్చిన భర్త

దుర్గి, జూలై 6: అనుమానంతో భార్యను కడతేర్చిన ఘటన మండలంలోని పోలేపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. శనివారం దుర్గి పోలీస్‌స్టేషన్‌లో సీఐ అలహరి శ్రీనివాసరావు ఈ ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పోలేపల్లి గ్రామానికి చెందిన షేక్ ఖాదర్‌బాషాకు గురజాల మండలం దైదకు చెందిన సైదాబితో 30 ఏళ్ల క్రితం వివాహమైంది. భార్య సైదాబి (45) ఇతరులతో ఫోన్లో మాట్లాడుతుందని భర్త ఖాదర్‌బాషా అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం అర్థరాత్రి వారివురి మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో కోపోద్రిక్తుడైన ఖాదర్‌బాషా మంచం కోడుతో సైదాబి తలపై బలంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సైదాబి తల్లి నాగూర్‌బీ ఫిర్యాదు మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు, కారంపూడి సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ అమీర్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. హత్య చేసిన అనంతరం భర్త ఖాదర్‌బాషా పరారు కాగా శనివారం అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరు పరిచినట్లు చెప్పారు. మృతురాలికి ముగ్గురు సంతానం.

పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

వినుకొండటౌన్, జూలై 6 : వినుకొండలోని కిసాన్ ఆగ్రోటెక్ పురుగు మందుల తయారీ కేంద్రంలో శనివారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి 13.85 లక్షల రూపాయల విలువ గల పురుగు మందుల తయారీకి ఉపయోగించే ముడిపదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అధికారి డీడీఏ సిహెచ్. శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం తయారీ కేంద్రానికి గతంలో అనుమతులు ఉన్నప్పటికీ, నిల్వలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా లేక పోవడంతో యర్రంశెట్టి జయరామ్‌కు సంబంధించిన లైసెన్స్ రద్దు చేసినట్టు తెలిపారు. అదే విధంగా శివయ్య స్థూపం సెంటర్‌లోని జయలక్ష్మీ సీడ్స్, లక్ష్మీసీడ్స్ కార్పొరేషన్ షాపుల్లో రికార్డుల్లో నమోదు కాని రూ. 4 లక్షలు విలువ చేసే విత్తనాలను సీజ్ చేశామన్నారు. తనిఖీలను పసికట్టిన ఎరువులు దుకాణదారులు అర్ధాంతరంగా షాపులను మూసివేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్‌ఐ రామ చంద్రయ్య, విజిలెన్స్ ఏవో వరలక్ష్మీ, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

ఆర్వీఆర్‌జేసీ విద్యార్థిని ప్రతిభ



అరికట్ల విజయలక్ష్మీ

గుంటూరు(విద్య), జూలై 6 : బెంగళూరుకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ వేఫైర్ గ్లోబల్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆర్వీఆర్ అండ్ జేసీ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో సీఎస్‌ఈ విభాగంలో చివరి సంవత్సరం చదువుతున్న అరికట్ల విజయలక్ష్మి 25 లక్షల రూపాయల ప్యాకేజీతో అసోసియేట్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగానికి ఎంపికైనట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరుగైన విద్యాబోధనతో క్యాంపస్ ఇంటర్వ్యూలకు అవసరమైన శిక్షణ అందించడంతో టెక్నాలజీని దృష్టిలో పెట్టుకుని అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు నిపుణులచే శిక్షణను అందిస్తున్నామని తెలిపారు. ఉద్యోగం పొందిన విద్యార్థినిని కళాశాల అకడమిక్, ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్వి శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ సి హెచ్ శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

రేవులకు 12న జిల్లా పరిషత్‌లో వేలం

గుంటూరు సిటీ, జూలై 6 : ఉమ్మడి గుంటూరు జిల్లాలోని రేవులకు సుంకం వసూలు చేసుకొనేందుకు ఈ నెల 12వ తేదీన జిల్లా పరిషత్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ వసంత రాయుడు తెలిపారు. వేలంలో పాల్గొని హక్కు దక్కించుకున్న వారికి ఈ ఏడాది జూలై 1 వ తేదీ నుంచి 2025 మార్చి 31 వ తేదీ వరకు సుంకం వసూలు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అచ్చంపేట మండలంలోని చామర్రు (పడవ), చింతపల్లి (పడవ), గింజుపల్లి (పడవ), తాడ్వాయి (పడవ), మాదిపాడు (పడవ), మాదిపాడు(బల్లకట్టు), మాచవరం మండలంలోని గోవిందాపురం (బల్లకట్టు), అమరావతి మండలంలోని దిడుగు, దరణికోట, కొల్లిపర మండలంలోని వల్లభాపురం రేవులకు 12వ తేదీన వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీల్డ్ టెండర్లు దాఖలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తామని సీఈఓ వెల్లడించారు.



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ నాగభూషణ్ తదితరులు

విజ్ఞాన్‌లో ఘనంగా భారత్ పిచథాన్ 3.0

గుంటూరు (విద్య), జూలై 6 : స్థానిక చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఆఫీస్ ఆఫ్ డీన్ ప్రమోషన్స్ కొలాబరేషన్స్ అండ్ ఫ్యాకల్టీ అఫైర్స్, విజ్ఞాన్ టీబీఐ, ఈసెల్, హెడ్‌స్టార్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో భారత్ పిచథాన్ 3.0 కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ ముఖ్యఅతిథిగా హాజరై పారిశ్రామికవేత్తలతో సంభాషించి వారిని ప్రోత్సహిస్తూ, పారిశ్రామికవేత్తలకు విజ్ఞాన్ అందిస్తున్న సహకారం గురించి మాట్లాడారు. అనంతరం హైదరాబాద్‌లోని నాంది వెంచర్స్‌తో ఎంవోయూపై సంతకం చేశారు. అనంతరం ఎంవోయూ పత్రాలను నాంది వెంచర్స్ కో ఫౌండర్ వికాస్ కాట్రగడ్డకు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజోర్‌పే కమ్యూనిటీ ప్లాట్‌ఫామ్స్ లీడ్ ఈశిత మహేశ్వరి మాట్లాడుతూ సరికొత్త ఆవిష్కరణలతో ముందుకు వచ్చే వారికి కావలసిన ఆర్థిక తోడ్పాటును కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో హెడ్‌స్టార్ట్ ఫౌండేషన్ ఏపీ లీడ్, అవసర్గాల కో ఫౌండర్ అశ్వతి వేణుగోపాల్, జెల్పా మాక్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ జరన్ భగ్వాగర్, ఏజీఆర్ కార్పొరేట్ కన్సల్‌టెంట్స్ సీఈవో వరుణ్ ఏజీ రెడ్డి, నాంది వెంచర్స్ కోఫౌండర్ వికాస్ కాట్రగడ్డ, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్నేహితుడే హంతకుడు !

మాచర్లటౌన్, జూలై 6: వెల్దుర్తి మండలం మిట్టమీదపల్లెలో గత గురువారం జరిగిన పులి చిన వెంకటరెడ్డి హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధం నేపథ్యంలోనే హత్య జరిగినట్లు గుర్తించారు. ఈ మేరకు మాచర్ల పట్టణంలోని రూరల్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో గురజాల డీఎస్పీ శ్రీనివాసరావు హత్య కేసు వివరాలను శనివారం విలేకరులకు వెల్లడించారు. వెల్దుర్తి మండలం మిట్టమీదపల్లె గ్రామానికి చెందిన పులి చిన వెంకటరెడ్డి, జింకల పోలిరెడ్డిలు స్నేహితులు. పోలిరెడ్డి గ్రామానికి చెందిన పద్మ అనే మహిళతో సహజీవనం చేస్తున్నాడు. తన స్నేహితుడైన చిన వెంకటరెడ్డి కూడా పద్మతో సహజీవనం చేస్తూ సన్నిహితంగా మెలిగాడు. ఇది ప్రత్యక్షంగా చూసిన పోలిరెడ్డి వారివురిని మందలించాడు. కాగా పోలిరెడ్డి కిడ్నీ సమస్యతో బాధపడుతూ తనకు వైద్య చికిత్స చేయించమని చిన వెంకటరెడ్డికి రూ. 3 లక్షల వరకు డబ్బులిచ్చాడు. వైద్య ఖర్చులకు సుమారు రూ. 70 వేలు అవుతాయని, మిగతా డబ్బులు లెక్క చెప్పాలని పోలిరెడ్డి కోరడంతో చిన వెంకటరెడ్డి మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ఈనెల 4న వారివురు గ్రామ సమీపంలోని పొలాల్లోకి వెళ్లి మద్యం తాగారు. వివాహేతర సంబంధం, డబ్బులు విషయాలు మనసులో పెట్టుకున్న పోలిరెడ్డి.. చిన వెంకటరెడ్డి మద్యం మత్తులోకి జారుకోగానే గొడ్డలితో మెడపై విచక్షణారహితంగా నరికి హత్య చేసి పరారయ్యాడు. ఈ క్రమంలో నిందితుడు పోలిరెడ్డిని శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో మండలంలోని శిరిగిరిపాడు చెక్ పోస్టు వద్ద అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. హత్యకు ఉపయోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకొని నిందితుడు పోలిరెడ్డిని కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు. డీఎస్పీ వెంట రూరల్ సీఐ సురేష్, మాచర్ల రూరల్ ఎస్‌ఐ రాజశేఖర్, విజయపురిసౌత్ ఎస్‌ఐ పట్టాభి, వెల్దుర్తి ఎస్‌ఐ సత్యనారాయణలు ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

గ్రామైక్య సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలి



సమీక్షలో మాట్లాడుతున్న ఏపీఎం శ్రీమన్నారాయణ

భట్టిప్రోలు, జూలై 6 : గ్రామైక్య సంఘాలు ఆర్థికంగా బలోపేతమయ్యేలా యానిమేటర్లు కృషి చేయాలని ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశం హాల్లో మండల సమాఖ్య కార్యనిర్వాహక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలపరిధిలో ఉన్న ప్రతి యానిమేటరు క్రమం తప్పకుండా చిన్న సంఘాలు, గ్రామ సంఘాల సమావేశాలు నిర్వహించి సమావేశంలోనే పుస్తక నిర్వహణ గురించి సమగ్రంగా వివరించాలన్నారు. అర్హులైన పేద మహిళలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని పలు సూచనలు చేశారు. ఆర్థిక నిర్వహణ కోసం మహిళందరూ బ్యాంకు ఖాతా కలిగి ఉండాలన్నారు. స్త్రీనిధి మేనేజర్ పిల్లి అశోక్ మాట్లాడుతూ 2014-15 ఆర్థిక సంవత్సరానికి మండలానికి రూ.6 కోట్ల స్త్రీ నిధి జీవనోపాదుల రుణాల నిమిత్తం లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు. జీవనోపాధి కోసం అర్హులైన మహిళలకు స్త్రీనిధి రుణాలు అందేలా చూడాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ టీఏ సుధీర్ మాట్లాడుతూ 25 సెంట్ల నుంచి 1 ఎకరం లోపు సొంత భూమి కల్గిన రైతులకు పండ్లు, పూలతోట్ల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మహిళలందరికి డెమో పద్ధతిలో విత్తనశుద్ధి బీజామృతంపై వివరించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు జాలాది ధనలక్ష్మి, సౌజన్య, శ్రీదేవి, జ్యోతి, సీసీలు డి.హానోకు, కె.రజనీకుమారి, హౌసింగ్ ఏఈ రాపూరి సౌమ్య, అకౌంటెంట్ బత్తుల శిరీష, యానిమేటర్లు పాల్గొన్నారు.

రైతులు వరి విత్తనాలను సద్వినియోగించుకోవాలి

● వ్యవసాయ విస్తరణాధికారి జీవీ శేషమ్మ



రైతులకు వరివిత్తనాలు అందజేస్తున్న వ్యవసాయ విస్తరణాధికారి జీవీ శేషమ్మ, సర్పంచ్ మంతెన గంగరాజు తదితరులు

పిట్టలవానిపాలెం, జూలై 6: వ్యవసాయ తరుణం ఆరంభం కావటంతో రైతులకు వరివిత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ విస్తరణాధికారి జీవీ శేషమ్మ తెలిపారు. మండలంలోని అల్లూరు రైతుసేవా కేంద్రం పరిధిలోని అలకాపురం గ్రామపంచాయతీ నందు శనివారం వ్యవసాయశాఖవారు రైతులకు కేజీకి రూ.5 సబ్సిడీపై అందిస్తున్న బీపీటీ 5204, ఎంటీయూ 1224, 1061 వరివిత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 2024-2025 సంవత్సరానికి గాను పంటసాగుదారుల హక్కుల పత్రాలు (కౌలుదారుహక్కుపత్రాలు) సంబంధిత రెవెన్యూ శాఖ అందిస్తున్నారని, ప్రకృతి వైపరీత్యాలు సమయంలో లేదా, ధాన్యం అమ్మకాల సమయంలో ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ మంతెన గంగరాజు, గ్రామపెద్దలు బేతాళం అచ్యుతరామరాజు, పెనుమెత్స మూర్తిరాజు, వీఏఏ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరం

భట్టిప్రోలు, జులై 06 : ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో భట్టిప్రోలు ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం స్థానిక రైలుపేటలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జ్ మెడికల్ ఆఫీసర్ పి.నాగసుధ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉన్నందున ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో వైద్య శిబిరాలు నిర్వహించాల్సిందిగా ఆయుశాఖ ఆదేశాలు జారీ చేసినట్లు ఆమె తెలియజేశారు. ఈ శిబిరంలో 200 మందిని పరీక్షించి సీజనల్, జనరల్ వ్యాధులకు సంబంధించి పలు సూచనలు జాగ్రత్తలను తెలియజేశారు. ఈ శిబిరంలో కాంపౌండర్ జి.జితేంద్ర, జి.ప్రసాదరావు, ఆశా కార్యకర్త రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన వైద్యుడిపై చర్యలు

కొల్లూరు, జులై 6 : మహిళా సిబ్బందిపై లైంగిక వేధింపులకు పాల్పడిన వైద్యుడిపై చర్యలు తీసుకున్నట్లు కొల్లూరు పీహెచ్‌సీ వైద్యురాలు కావ్య శనివారం తెలిపారు. స్థానిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఆమె విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఇక్కడ వైద్యుడిగా పనిచేసిన డి.రవిబాబు మహిళా సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించి లైంగిక వేధింపులకు పాల్పడటంతో సిబ్బంది డీఎంహెచ్‌వోకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన డీఎంహెచ్‌వో వైద్యుడిపై విచారణ చేయగా ఆయన వేధింపులు వాస్తవమేనని తేటతెల్లం కావడంతో ఆయనను వైద్య ఆరోగ్యశాఖ గొల్లపూడి కార్యాలయానికి సరెండర్ చేస్తున్నట్లుగా ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు తెలిపారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా కనకదుర్గ

వేమూరు, జులై 6: మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా కనకదుర్గ శనివారం బాధ్యతలు స్వీకరించారు. రేపల్లె నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసిన కనకదుర్గ వేమూరు కార్యాలయానికి డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగిస్తూ బదిలీ చేశారు. కలెక్టర్ ఉత్తర్వుల మేర కు ఆమె తహసీల్దార్ కిరణ్ సమక్షంలో బాధ్యతలు చేపట్టారు.

ఆంగ్ల అధ్యాపకుడు భానుశంకర్‌కు డాక్టరేట్



భానుశంకర్

భట్టిప్రోలు, జులై 6 : కేఎస్‌కే కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఆంగ్ల అధ్యాపకుడిగా పనిచేస్తున్న బిట్రా భానుశంకర్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. ఎడ్యుకేషన్ విభాగం నుంచి అవేర్‌నెస్ అండ్ యాటిట్యూడ్ టువార్డ్స్ ఎమాంగ్ అండర్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్ అనే అంశంపై ఏఎన్‌యూకి చెందిన ప్రొఫెసర్ రవిశంకర్ మార్గనిర్దేశంలో పరిశోధనా పత్రం సమర్పించినందుకుగాను భానుశంకర్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేఎస్‌కే విద్యాసంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ కత్తెర సురేష్‌కుమార్ తెలియజేశారు. డాక్టరేట్ అందుకున్న ఆంగ్ల అధ్యాపకుడు భానుశంకర్‌ను కరస్పాండెంట్ సురేష్‌కుమార్, సీఈవో కె.డేవిడ్ యశ్వంత్, బోధన బోధనేతర సిబ్బంది అభినందించారు.

మంతెనవారిపాలెంలో గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న కార్యదర్శి కె.వసుంధరలక్ష్మి, లక్కంరాజు వెంకటపతిరాజు

పిట్టలవానిపాలెం, జూలై 6 : అర్హులైన ప్రతిఒక్కరికి ఎన్టీఆర్‌భరోసా పెన్షన్‌లు అందజేయటం ఎంతో అభినందనీయమని మంతెనవారిపాలెం గ్రామ సర్పంచ్ లక్కంరాజు ఆదిలక్ష్మీ వెంకటపతిరాజు అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పెన్షన్‌దారులకు రూ.7 వేలు అందజేశారని తెలిపారు. మండలంలోని మంతెనవారిపాలెం గ్రామసచివాలయం నందు సర్పంచ్ లక్కంరాజు ఆదిలక్ష్మి వెంకటపతిరాజు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో అనేక అంశాలపై సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి కె.వసుంధరలక్ష్మి వివిధ అంశాల పై సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నిత్యావసరాలు అందజేసిన ట్రాఫిక్ ఎస్ఐ

బాపట్ల, జులై 6: పట్టణంలోని హోప్ హాస్టల్ నందు విద్యార్థినులకు ట్రాఫిక్ ఎస్ఐ సుధాకర్ నిత్యావసర వస్తువులు అందజేశారు. హాస్టల్‌లో ఉండి చదువుకునే పేదవిద్యార్థులంతా చక్కగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని ఆదర్శంగా నిలవాలని ఆయన కోరారు. సమాజానికి వన్నె తెచ్చే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థినులకు నెలకు సరిపడిన నిత్యావసర వస్తువులను అందజేశారు.

జూనోసిస్ వ్యాధులపై అవగాహన

కర్లపాలెం, జులై 6: పెంపుడు కుక్కల యజమానులు జునోజిక్ వ్యాధులపై అవగాహన కలిగియుండాలని ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి ఎం రేచల్ దివ్య అన్నారు. కర్లపాలెంలోని పశువైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవంగా సందర్భంగా కుక్కలను పెంచే యజమానులకు శనివారం యాంటీ రేబీస్ వ్యాధిపై అవగాహన కల్పించారు.

చిన్నరేవులో మట్టి అక్రమ తవ్వకాలు

● పోతార్లంక పథకం పైపులైను ధ్వంసం
● బాధ్యుడిపై చర్యలు తీసుకోవాలి
● టీడీపీ నాయకుల ఫిర్యాదు



మట్టి అక్రమ తవ్వకాలతో బయటపడ్డ పోతార్లంక పైపు లైనును పరిశీలిస్తున్న మురళీకృష్ణ, రైతులు

కొల్లూరు, జూలై 6: ఇటుక తయారీ కోసం చిన్నరేవులో మట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడ్డారు. తవ్వకాల వల్ల పోతార్లంక ఎత్తిపోతల పథకం పైపు లైన్లు ధ్వంసమయ్యాయి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ డిమాండ్ చేశారు. ఎత్తిపోతల పథకం పైపులైన్లు ధ్వంసం కావడంతో ఎగువ ప్రాంత రైతులకు సాగునీరు అందట్లేదని ఎమ్మెల్యే ఆనందబాబుకు, మురళీకృష్ణ దృష్టికి రైతులు తీసుకువచ్చారు. దీంతో శనివారం మండల పరిధిలోని పోతార్లంక, కిష్కిందపాలెం మధ్య చిన్నరేవులో పైపులు దెబ్బతిన్న ప్రాంతాన్ని ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం చిన్నరేవులో మట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడటంతో పాటు పథకం పైపులైన్లపై ఉన్న మట్టిని సైతం ఇటుక తయారీకి పగిడాల సుబ్బారెడ్డి అనే వ్యక్తి తరలించుకుపోయాడని, మట్టి తవ్వకాల వల్ల పైపులు బయటపడి పగిలిపోయాయని వాటిపై సిమెంట్ పూత పూశారని ఆరోపించారు. పైపులు దెబ్బతినడం వల్ల పొలాలకు సాగునీరు అందకుండా పోయిందని ఈ విషయంపై రెండేళ్ల క్రితం పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేసినా తీసుకోలేదని వాపోయారు. అక్రమ తవ్వకాలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవడంతో పాటు పైపులైన్లు బాగు చేసి రైతులందరికి సాగునీరు అందే విధంగా మరికొన్ని బావుల నిర్మాణం కూడా చేపట్టాలని రైతులు కోరారు. మట్టి తవ్వకాలు చేసిన వ్యక్తి చాలాకాలంగా ఇటుక బట్టీల మాటున ఇసుకను నిల్వ చేసి రాత్రి సమయాల్లో లారీల్లో ఇసుక నింపి వాటిపై ఇటుక రాయి పేర్చి అక్రమ ఇసుక రవాణా చేస్తున్నాడని ఆరోపించారు. పైగా ఇటుక బట్టీల్లో నిల్వ ఉన్న ఇసుకను సైతం మురళీకృష్ణకు రైతులు చూపించారు. రైతులతో కొల్లూరు పోలీస్‌స్టేషన్ చేరుకున్న ఆయన ఇటుక తయారీ దారు చేసిన నిర్వాకంపై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ లిఖిత పూర్వక ఫిర్యాదు అందించారు. తహసీల్దార్‌కు కూడా దీనిపై లిఖిత పూర్వక ఫిర్యాదు అందజేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు సుంకర శ్రీను, నర్రా మధు, యార్లగడ్డ శ్రీనివాసరావు (బుజ్జి), బోయపాటి తేజ, లంకా చిట్టిబాబు, బీఎల్‌కే ప్రసాద్, వేములపల్లి, మోహన్, కోటయ్య, మున్నంగి విజయ్, రైతులు పాల్గొన్నారు.

అవినీతిని అరికట్టేందుకు ప్రజలంతా సహకరించాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవవర్మను సన్మానిస్తున్న బాపట్ల బులియన్ జ్యూయలర్స్, పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ నాయకులు

బాపట్ల, జూలై 6 : నియోజకవర్గంలో అవినీతిని అరికట్టేందుకు ప్రజలంతా సహకరించాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కోరారు. ఎక్కడ చూసినా అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని ఈ పరిస్థితి మారాలన్నారు. బాపట్ల బులియన్ జ్యూయలర్స్, పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం హోటల్ గౌతమ్‌నంద్ ఎమ్మెల్యేకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బాపట్ల పురపాలక సంఘ ప్రక్షాళన ప్రారంభమైందన్నారు. ప్రతి ప్రభుత్వశాఖను నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సమీక్ష సమావేశాల ద్వారా సరికొత్త ప్రణాళిక ప్రతిశాఖలో అమలు చేసేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవినీతి అధికారులతో ప్రజలు ఇబ్బంది పడకూడదని అవినీతిలేని సమాజం సాధించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎమ్మెల్యే నరేంద్రవర్మ కోరారు. అక్రమంగా బంగారం వస్తే కొనుగోలు చేసి ఇబ్బంది పడరాదని వ్యాపారులకు సూచించారు. ప్రభుత్వపరంగా అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు తమ సమస్యలను ఎమ్మెల్యే నరేంద్రవర్మ దృష్టికి తీసుకెళ్లారు. పట్టణ నడిబొడ్డున ఉన్న శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరబావన్నారాయణస్వామి దేవస్థానం గాలిగోపురం 13 సంవత్స రాలక్రితం కూలిపోయిందని అప్పట్లో ఆలయం చుట్టుపక్కల 200మీటర్లలోపు ఎటువంటి కట్టడాలు కట్టరాదని నిబంధన పెట్టారన్నారు. పూర్వం నిర్మించిన అనేక భవనాలు శిథిలావస్థకు చేరాయని వాటిని పునర్నిర్మించేందుకు నాటి ఆంక్షలు తొలిగించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. వైసీపీ పాలనలో అనేక పర్యాయాలు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బీహెచ్ మురళీ, అధ్యక్షుడు వి.లక్ష్మణామూర్తి, ఉపాధ్యక్షుడు కె.బాబు, కార్యదర్శి డి.రామకృష్ణ, జాయింట్ సెక్రటరి ఎం.నరేష్, కోశాధికారి ఎన్.నరేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే నరేంద్రవర్మను ఘనంగా సత్కరించి సన్మానించారు. జ్ఞాపికతో అభినందించారు.

స్వాతంత్ర్య సమరయోధుడు జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం



రేపల్లె ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అనగాని శివప్రసాద్, దళితసంఘాల నాయకులు

రేపల్లె, జూలై 6: దేశాభివృద్ధి కోసం స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా సమీపంలోని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ బాపట్ల జిల్లా అధికార ప్రతినిధి కూచిపూడి మోహనరావు, దారం సాంబశివరావు, తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దున్నా జయప్రద, ఆలూరి డానియేలు,విల్సన్, రామారావు, ఏడుకొండలు, కొలసాని రాము, తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలి

● టీడీపీ అధికార ప్రతినిధి విజయబాబు

వేమూరు, జూలై 6: అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి జగ్జీవన్‌రామ్ ఆశయ సాధన కోసంగా యువత కృషి చేయాలని బాపట్ల పార్లమెంటరీ స్థాయి తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అన్నారు. శనివారం వేమూరులో టీడీపీ శ్రేణులు జగ్జీవన్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయబాబు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ దళితులు, గిరిజనులు నమ్మిన వర్గాల ప్రజలు అన్ని రంగాల్లో సమానంగా పోటీ పడాలంటే రిజర్వేషన్లు తప్పనిసరిగా ఉండాలని పోరాటాన్ని సాగించిన మహావ్యక్తిగా కొనియాడారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త ఊసా రాజేష్, టీడీపీ నాయకులు కొండ్రు బుల్లియ్య, కోగంటి శ్రీనుబాబు, ఎలవర్తి సురేంద్ర, రామదాసు, గోపినాథ్, అన్నే ప్రసాద్, కోగంటి రాజేష్ తదితరులు పాల్గొని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జంపనిలో టీడీపీ, క్రిస్టియన్ యూత్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్ పాల్గొన్నారు. బలిజేపల్లిలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు సుధాకర్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు.

అగ్నివీర్‌కి దరఖాస్తుల ఆహ్వానం

● భారతవైమానికదళం నాన్ కమిషన్ ఆఫీసర్ ఎన్ సందీప్



అగ్నివీర్‌వాయుపై అనుబంధశాఖల అధికారులతో సమావేశమైన భారత వైమానిక దళం నాన్ కమిషన్ ఆఫీసర్ ఎన్ సందీప్

బాపట్ల, జులై 6: అగ్నివీర్‌వాయు భారతసైన్యంలోకి చేరటానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భారతవైమానిక దళం నాన్ కమిషన్ ఆఫీసర్ ఎన్ సందీప్ తెలిపారు. అగ్నివీర్ వాయుపై అనుబంధశాఖల అధికారులతో శనివారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత సైన్యంలోకి యువకులు చేరటానికి కేంద్రప్రభుత్వం అవకాశం కల్పించిందని చెప్పారు. ఈ నెల 8వ తేది నుంచి 28వ తేది వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. 2004 జూలై 3 నుంచి 2008 జనవరి 3వ తేదిలోపు జన్మించినవారు అర్హులు అన్నారు. భారతసైన్యంలోకి చేరాలనుకునేవారు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అక్టోబరు 18వ తేదిన రాత పరీక్ష ఉంటుందన్నారు. పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో పొందవచ్చుని చెప్పారు. బాపట్ల జిల్లాలోని 149 కళాశాలలో యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నాలుగు సంవత్సరాలు పాటు సైన్యంలో పనిచేయటం ద్వారా కలిగే ప్రయోజనాలను యువతకు వివరించాలన్నారు. సమావేశంలో ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐవో ఎర్రయ్య, ఎస్సీ సాధికారిత సంక్షేమఅధికారి జె.రాజాదేబోరా, కలెక్టరేట్ బిసెక్షన్ పర్యవేక్షకులు మల్లేశ్వరి, అనుబంధశాఖల అధికారులు పాల్గొన్నారు.

యజమానితో సంబంధం లేకుండా కౌలు కార్డులివ్వాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నేత డి.రమాదేవి

బాపట్ల, జూలై 6 : జిల్లాలోని కౌలు రైతులకు భూయజమానితో సంబంధం లేకుండా కౌలురైతు కార్డులు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి డిమాండ్ చేశారు. బాపట్ల పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన జిల్లాలో ఎక్కువ శాతం భూమిలేని పేదలు, కౌలు రైతులు ఉన్నారన్నారు. వారికి కౌలురైతుకార్డులిచ్చి రుణాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. భూయజమానితో సంతకం పెట్టించాలన్న నిబంధనలను గత ప్రభు త్వం పెట్టిందని ఆ నిబంధనలను కొత్తప్రభుత్వం తొలిగించాలని కోరారు. కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను ఇవ్వాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, జిల్లాకమిటీ సభ్యులు టి.కృష్ణమోహన్, మసుందర్, మణిలాల్, బాబురావులు పాల్గొన్నారు.

కౌలు రైతు కుటుంబానికి రూ.20లక్షలు పరిహారం ఇవ్వాలి

అప్పుల బాధతో చనిపోయిన కౌలురైతు కుటుంబానికి ప్రభుత్వం 20లక్షల రూపాయల నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డి.రమాదేవి కోరారు. బాపట్ల మండలం భర్తీపూడిలో అప్పుల బాధతాళలేక ఆత్మహత్యకు పాల్పడిన ర్యాలీ పేరయ్య కుటుంబాన్ని శనివారం రాత్రి సీపీఎం నాయకులతో కలిసి ఆమె పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా వ్యవసాయంలో నష్టం వచ్చి చేసిన అప్పులు తీర్చే అవకాశంలేక ఆత్మహత్యకు పాల్పడటం దురదృష్టకమరన్నారు. వెంటనే ప్రభుత్వం సాయం అందిం చి ఆదుకోవాలన్నారు. మృతుడి భార్యకు పక్కా ఇల్లునిర్మించి వితంతు పెన్షన్ వచ్చేవిధంగా అధికారులు చూడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్.గంగయ్య, కమిటీ సభ్యులు భర్తీపూడి గ్రామసర్పంచ్ అచంట ఆమరేష్ తదితరులున్నారు.

రజ్జుబాషాకి ప్రముఖుల నివాళి



సైనిక లాంఛనాలతో రజ్జుబాషా అంత్యక్రియులు నిర్వహిస్తున్న ఆర్మీఅధికారులు

బాపట్ల,జూలై 6 : రజ్జుబాషా అంత్యక్రియులలో పాల్గొన్న పలుప్రముఖులు ఘననివాళులు అర్పించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆర్డీవో గంధం రవీందర్, డీఎస్పీ పి.మురళీకృష్ణ, పట్టణసీఐ యు.శ్రీనివాసులు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, పట్టణటీడీపీఅధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లాఅధ్యక్షులు తాండ్ర సాంబశివరావు, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, అసోసియేషన్ ఉపాధ్యక్షులు పుట్టా ఆదిశేషారెడ్డి, కోశాధికారి పువ్వాడ యలమంద, మాజీ సైనికులు తోట దుర్గారావు, కె.అంజనేయులు, డి.వెంకటేశ్వర్లు, మర్రి వీరాస్వామి, పి.రాధాకృష్ణమూర్తి, పసుపులేటి ప్రసాద్, బక్కా రామకృష్ణారెడ్డి, పోతురాజురెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, ధర్మారెడ్డి, బసివిరెడ్డి, కె.ఎల్.ఎన్.ప్రసాద్, ముజఫర్, ఖలీల్, రాయపూడి శ్రీనివాసరావు, వసంతరావు, గుంటూరుజిల్లా సైనిక వెల్ఫేర్ కార్యాలయసిబ్బంది, వివిధపార్టీలనాయకులు తదితరులు అంత్యక్రియలలో పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

● పంచాయతీరాజ్ అధికారులతో ఎమ్మెల్యే ఆనందబాబు



పంచాయతీరాజ్ శాఖ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, జూలై 6 : నియోజకవర్గంలో పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని అభివృద్ధి పనుల నిమిత్తంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆ శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం గుంటూరు క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి పంచాయతీరాజ్‌శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన పనుల విషయాన్ని ప్రస్తావనకు తీసుకురావద్దని అన్నారు. గ్రామాల్లో ప్రాధాన్యతను గుర్తించి ప్రభుత్వ భవనాలు, రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి గ్రామంలో కూటమి నాయకులతో సంప్రదించి పనులను గుర్తించాలన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు పనులు చేపడతాం. ప్రతిపాదనలను బడ్జెట్ సమావేశాల అనంతరం ప్రభుత్వానికి పంపి తగిన విధంగా నిధులు మంజూరు చేయిస్తానన్నారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అత్యవసరమైన, మేజర్ పనుల వివరాలు కొన్నింటిని అధికారులు ఆనందబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఏదైనా ప్రతిపాదనల జాబితాలో చేర్చి ఇవ్వాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ డీఈ శ్యామ్‌ప్రసాద్, ప్రాజెక్టు డీఈ సాయికిషోర్, జేఈలు శ్రీనివాసరావు, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి తోడ్పాటునందించాలి

● కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



కలెక్టర్ జె.వెంకటమురళీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ జిల్లా నాయకులు

బాపట్ల, జూలై 6: జిల్లాలో విద్యారంగానికి తోడ్పాటునందించి పాఠశాలల ఏర్పాటుకు సహకరించాలని కృష్ణా - గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కలెక్టర్ జె.వెంకటమురళీని కోరారు. యూటీఎఫ్ నాయకులతో కలిసి శనివారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన లక్ష్మణరావు పలు విషయాలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గుంటూరుఛానల్ విస్తరణకు సహకరించాలని కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టినందుకు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జె.వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి మద్దాల సురేష్, యూటీఎఫ్ సీనియర్ నాయకులు సాంబయ్యనాయక్, బాపట్ల మండల ప్రధాన కార్యదర్శి డి.నస్సేరయ్య, బాపట్ల పట్టణాధ్యక్షుడు జి.రాజేష్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌కు ఎంపీ కృష్ణప్రసాద్ శుభాకాంక్షలు

బాపట్ల, జూలై 6: కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జె.వెంకటమురళీని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. బాపట్లజిల్లా అభివృద్ధిలో కలిసి ఉంటామని ప్రజా సంక్షేమమే తమ లక్ష్యమని ఎంపీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

జనసేననాయకుడు నామన..

కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జె.వెంకటమురళీని శనివారం జనసేనపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

● మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

నగరం, జూలై 6: విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని ఉల్లిపాలెంలోని అల్లపర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం చదువుకునేందుకు అనేక రాయితీలను కల్పిస్తుందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో తీర్చిదిద్దుతుందన్నారు. ఉత్తమమైన విద్యార్థులతో విద్యాబోధన అందిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులను,బ్యాగ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మేకా వెంకట శివరామకృష్ణ, నగరం జడ్పీటీసీ మాన్యం నాగమణి, నగరం మండలి విద్యాశాఖాధికారి పులి లాజర్, నాగళ్ళ శ్రీహరి, విద్యాకమిటి ఛైర్మన్ భూషణం, ఉపాధ్యాయులు యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల పాదయాత్ర చేస్తున్న టీడీపీ అభిమానులకు ఎస్సీ సెల్ సంఘీభావం

వేమూరు, జూలై 6: రాష్ట్రంలో కూటమి పాలన రావాలని వేమూరు నియోజకవర్గంలో నక్కా ఆనందబాబు ఎమ్మెల్యేగా అఖండ మెజార్టీతో విజయం సాధించాలని అందుకు తిరుమల వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు కావాలని కోరుకుంటూ ఫలితాలు అనంతరం తిరుమలకు పాదయాత్రగా వెళుతున్న జంపనికి చెందిన టీడీపీ అభిమానులు మన్నే శ్రీనివాసరావు, పెరుమాళ్ళ వెంకట సుబ్బయ్య, పెరుమాళ్ళ వంశీకృష్ణలకు టీడీపీఎస్సీ సెల్ నాయకులు శనివారం సంఘీభావాన్ని తెలిపారు. పాదయాత్రలో ప్రకాశం జిల్లా కావలి వరకు వెళ్లిన వారిని కలుసుకొని పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు. వేల్పుల రవి ప్రసాద్, వేల్పుల జయప్రకాష్, చోడవరపు అరుణ్‌కుమార్, జంపని లూకా రాజు, కంచర్ల నాని తదితరులు పాదయాత్ర చేస్తున్న వారిని కలుసుకున్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

బాపట్లరూరల్, జూలై 6 : రైలు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం బాపట్ల మండలం కుక్కలవారిపాలెం సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే బాపట్ల పట్టణం ధరివాదకొత్తపాలెం గ్రామానికి చెందిన ఎం మస్తాన్‌రెడ్డి (29) అనే వ్యక్తి కుటుంబ సమస్యల నేపథ్యంలో మద్యం సేవించి కుక్కలవారిపాలెం సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు రైల్వే పోలీసులు తరలించారు. కేసు నమోదు చేసి బాపట్లరూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి పరామర్శ

కొల్లూరు, జూలై 6 : అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ కార్యకర్త కుటుంబాన్ని టీడీపీ మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ శనివారం పరామర్శించారు. మండలపరిధిలోని గాజుల్లంకలో మత్తి శ్రీనివాసరావు (60) అనారోగ్యంతో బాధపడుతూ వైద్యశాలలో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న టీడీపీ నేత గ్రామానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

బాపట్ల, జూలై 6 : పట్టణంలోని రామకృష్ణపురంనకు చెందిన అక్కి హరిబాబు బైక్‌పై వెళుతుండగా బలాదూరు సాయి డబ్బులు అడిగాడని ఇవ్వకపోవటంతో తనను తిట్టి రాయితో కొట్టి తలపగలగొట్టాడని ఆస్పత్రిలో చేరి ఇచ్చిన రిపోర్ట్‌మేరకు పట్టణ ఎస్ఐ రజాక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా తన పెద్దనాన్న బలాదూరు సాయిని హరిబాబు కొడుతున్నట్లు తెలుసుకొని అడ్డువెళ్ళిన బలాదూరు శ్రీనివాసరెడ్డిని కర్రతో కొట్టి గాయపరిచినట్లు ఆస్పత్రిలో చేరి ఇచ్చిన రిపోర్ట్‌మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- అదే ప్రజా కూటమి ప్రభుత్వ ధ్యేయం
- గత సర్కార్ ప్రారంభించిన ఏ పనులనూ ఆపవద్దు
- అవినీతికి పాల్పడిన అధికారులను ఉపేక్షించం
- ఆగస్టు నాటికి గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు ఏర్పాటు
- తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి
- మంచినీటి పథకం పనులు వేగవంతం చేయాలి
- గుండ్లకమ్మ బ్రిడ్జి, ఊటబావుల వద్ద ఇసుక తవ్వకాలు జరగకుండా చూడాలి
- నామ్ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయండి
- కాలువ కట్టపై మినీ బైపాస్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి


సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

అద్దంకి, జూలై 6 : సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించడమే ప్రజా కూటమి ప్రభుత్వ ధ్యేయం అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి మున్సిపల్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో అద్దంకి పట్టణ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై మంత్రి రవికుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రారంభించిన ఏ పనునూ ఆపవద్దని, కక్ష సాధింపుతో పథకాలను ఆపడం టీడీపీ ప్రభుత్వ ఉద్దేశం కాదని, ప్రజలకు మేలు చేయడమే లక్ష్యమని మంత్రి అన్నారు. అవినీతికి పాల్పడిన అధికారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని గొట్టిపాటి హెచ్చరించారు. అద్దంకి పట్టణంలో తాగునీరు, మురుగు కాలువలను శుభ్రం చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.85కోట్లతో సమగ్ర మంచినీటి పథకాన్ని మంజూరు చేసి పనులు ప్రారంభించామన్నారు. ఐదేళ్లలో ఆ పనులను పూర్తి చేయడంలో వైసీపీ విఫలమైందన్నారు. రీ టెండర్‌ల పేరుతో పథకం రూపురేఖలను మార్చిందన్నారు. దీంతో టిడ్కో ఇళ్ల వద్ద కొండపై ఏర్పాటు చేయాల్సిన మంచి నీటి ఓవర్‌హెడ్ ట్యాంక్ రద్దు అయిందన్నారు. పట్టణంలో అంతర్గత మంచి నీటి పైప్ లైన్ ఏర్పాటు సమయంలో సీసీ రోడ్లు పగులగొట్టి వదిలివేయడంతో ప్రజలు ఇబ్బంది పడి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. పనులు ఆగిపోవడానికి కారణాలను అధికారులను అడుగగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మంచినీటి పథకం పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. అన్ని వార్డులలో తాగు నీటి ఎద్దడి లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, అవసరమైతే గుండ్లకమ్మ నదిలో మరి కొన్ని ఊటబావులను ఏర్పాటు చేసుకోవాలని, అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. మంచినీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. స్వచ్ఛమైన నీరు అందించాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదే సమయంలో మెయిన్ సైడ్ డ్రైన్‌లలో ఎక్స్‌కవేటర్‌తో పూడికతీత పనులు చేయించాలన్నారు. ప్లాస్టింగ్ కవర్ల వాడకంవల్ల కలిగే ఇబ్బందులపై ప్రజలకు అవగాహన కల్పించి వినియోగం పూర్తిగా తగ్గించేలా చర్యలు చేపట్టాలన్నారు. గుండ్లకమ్మ నదిలో బ్రిడ్జి వద్ద, ఊటబావుల సమీపంలో ఇసుక తవ్వకాలు జరగకుండా మున్సిపల్, పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆగస్టు నాటికి గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు గేట్లు ఏర్పాటు చేసి నీరు నిల్వ ఉండేలా చేస్తామన్నారు. టిడ్కో ఇళ్ల గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 90శాతం మేర పూర్తయినా వైసీపీ ప్రభుత్వం ఆ తరువాత ఏ పనిచేపట్టలేదన్నారు. త్వరలో అన్ని పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడం జరుగుతుందన్నారు. త్వరలో రాష్ట్రంలో ఒకే రోజు 180 అన్న క్యాంటీన్‌లను తిరిగి ప్రారంభిస్తున్న నేపథ్యంలో అద్దంకిలో ఉన్న అన్న క్యాంటీన్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కొత్తగా మూడు సబ్‌స్టేషన్‌లను టిడ్కో ఇళ్ల వద్ద, ఎస్ఎస్‌పి కాలనీ, గుండ్లకమ్మ బ్రిడ్జి సమీపంలో ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం రూ.2కోట్లతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, కొత్త విద్యుత్‌లైన్‌లు ఏర్పాటు తదితర పనులు జరుగుతున్నాయని, నెల రోజులలో పూర్తి చేస్తామని విద్యుత్ శాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు మంత్రికి వివరించారు. రైతులకు పరిహారం చెల్లించి నామ్ రోడ్డు లో గోపాలపురం, ఏల్చూరు వద్ద అసంపూర్తిగా ఆగిపోయిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. అదే సమయంలో నామ్ రోడ్డు వెంబడి ఉన్న సైడ్ డ్రైన్‌లు ప్రజలకు ఉపయోగపడేలా మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకొని డిజైన్ చేసి పనులు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అసవరమైన చర్యలు చేపట్టాలన్నారు. కాలువ కట్టను మినీ బైపాస్‌గా మార్చేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ భూములను గుర్తించి కార్యాలయాలకు కేటాయించాలన్నారు. ఏళ్లుగా అగ్నిమాపక కేంద్రానికి స్థలం కేటాయించలేక పోయారని వెంటనే పరిశీలించాలన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన అన్ని ఇళ్లను లబ్ధిదారులు నిర్మించుకునేలా చూడాలన్నారు. ఇసుక సమస్య లేకుండా ఉండేందుకు త్వరలో ఉచిత ఇసుకపై ప్రభుత్వం పాలసీ విడుదల చేస్తుందన్నారు. అధికారులు బాగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ సమీక్షలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, విద్యుత్, మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఈఈలు నల్లూరి, జానీ, హౌసింగ్ పీడీ ప్రసాద్, టిడ్కో, నామ్ అధికారులు, కౌన్సిలర్‌లు మాగులూరి తిరుపతమ్మ, కంపా రజనీ, మొండితోక సీతమ్మ, రంగిశెట్టి సుభాషిణి, అత్తులూరి రమేష్, విజయలక్ష్మి, జహీరా, తేజశ్వని, ఏజెండ్ల నాగరాజు, వైస్ చైర్మన్ దేసు పద్మేష్, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.


పాదయాత్రగా వెళ్తున్న టీడీపీ యువనేత రాఘవేంద్ర తదితరులు

శింగరకొండకు పాదయాత్ర

ఆంజనేయస్వామికి మొక్కు చెల్లించుకున్న టీడీపీ యువనేత

బల్లికురవ, జూలై 6 : మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువనేత కట్టా రాఘవేంద్ర ఆధ్వర్యంలో శనివారం శింగరకొండ ఆంజనేయస్వామి ఆలయానికి పాదయాత్ర చేపట్టారు. టీడీపీ కూటమి అధికారం చేపట్టి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు బాధ్యతలు చేపట్టడంతో పాటు అద్దంకి ఎమ్మెల్యేగా గొట్టిపాటి రవికుమార్ ఐదోసారి ఘన విజయం సాధించడంతో శింగరకొండకు పాదయాత్రగా నడిచివస్తామని మొక్కుకున్నారు. ఈ మేరకు యువనేత రాఘవేంద్ర పాదయాత్రగా వెళ్లి అంజనేయస్వామికి మొక్కు తీర్చుకున్నారు. ఈ పాదయాత్రను టీడీపీ నియోజకవర్గ యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) ప్రారంభించారు. పార్టీకి చెందిన నేతలు, మహిళలతో పెద్ద ఎత్తున కొత్తపాలెం గ్రామం నుంచి సుమారు 20 కిలోమీటర్ల వరకు పాదయాత్ర చేసి అంజనేయస్వామికి మొక్కులు చెల్లించారు. ముందుగా బాబీ కొత్తపాలెంలో టీడీపీ పార్టీ జెండాను ఎగుర వేసి విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమాలలో నేతలు మలినేని గోవిందరావు, కట్టా రామకృష్ణ, చల్లగుండ్ల రాంబాబు, ధూళిపాళ్ల పున్నారావు, ఆదిశేషయ్య, మాదాల సాంబశివరావు, బందారు శేషయ్య వీరాంజనేయులు, అజయ్, వీరాంజనేయులు, ఏల్చూరి వెంకయ్య, నరసిహారావు, కోయ దానారావు పాల్గొన్నారు.

మురుగు కాలువపై ఆక్రమణలు తొలగించాలి

సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్

ఇంకొల్లు, జూలై 6 : ఇంకొల్లు ప్రధాన రహదారిలో రోడ్డు విస్తరణ సమయంలో ఆక్రమణలు తొలగించగా, తిరిగి యథావిధిగా మురుగు కాలువలను సైతం ఆక్రమించుకున్నారని ఎంపీటీసీ సభ్యుడు ఆయోషాబుడే ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ బండారు అనూష అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆక్రమణల కారణంగా పారిశుధ్య పనులు సాగక, దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. వెంటనే కాలువలపై ఆక్రమణలు తొలగించి పారిశుధ్య పనులు మెరుగుపరచాలని పట్టుబట్టారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చొరవచూపాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ కౌలు రైతులు గుర్తింపు కార్డును పొందాలని, అప్పుడే నష్టం జరిగితే పరిహారం అందుతుందని తెలిపారు. ఎంఈవో అజయ్‌బాబు మాట్లాడుతూ బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఏపీవో రేణుక మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో పీఆర్ డీఈ విభూషణరావు, తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీవో శ్రీదేవి, ఏపీఎం మోహనరావు, సీడీపీవో జ్యోతి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు రావి పేరయ్య దుద్దుకూరు సర్పంచ్ మల్లెం శ్రీనివాసరావు, గంగవరం ఎంపీటీసీ సభ్యుడు రాజగోపాల్ పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలి

అద్దంకిటౌన్, జూలై 6 : కుక్క కాటు ప్రాణాంతకమని, పెంపుడు జంతువులు ఉన్నవారు వాటి వలన ఎటువంటి వ్యాధులకు రాకుండా ముందస్తుగానే టీకాలు వేయించుకోవాలని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ అన్నారు. శనివారం ప్రపంచ జోనోసిస్ దినం సందర్భంగా అద్దంకి ప్రభుత్వ పశు వైద్యశాలలో రేబిస్ వ్యాధి రాకుండా కుక్కలకు ఉచిత టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యశాల ఏడీ డాక్టర్ మోహనరావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా జూలై 6న జోనోసిస్ డేని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కుక్క కాటుతో రేబిస్ వస్తుందని, పెంపుడు జంతువుల నుంచి, మనుషులకు, మనుషుల వాటికి ఎలాంటి సంక్రమిత వ్యాధులు రాకుండా లూయి పార్చర్ అనే శాస్త్రవేత్త 1885లో టీకాను కనుగొన్నారన్నారు. దీనిపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏటా పెంపుడు జంతువులకు టీకాలు వేయాలని సూచించారు. అనంతరం పలు కుక్కలకే డాక్టర్ మోహనరావు టీకాలు వేశారు. కార్యక్రమంలో పలువురు పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

బల్లికురవ, జూలై 6 : ఉప్పుమాగులూరు గ్రామంలో ఆదివారం చిటిపోతు, చిడిపోతు వంశస్థుల సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు చిటిపోతు మస్తానయ్య తెలిపారు. విజయవాడకు చెందిన హెల్ప్ సూపర్ స్పెషాలిటీ కేర్ వైద్యశాల వైద్య బృందంతో చిటిపోతు వారి సత్రంలో వైద్య శిబిరం జరుగుతందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. గుండె సంబంధిత పరీక్షలను ఉచితంగా చేసి, మందులను అందజేస్తామని తెలిపారు.

తప్పిపోయి వచ్చిన పది గేదెలు

బల్లికురవ, జూలై 6 : మండలంలోని ముక్తేశ్వరం గ్రామానికి మూడు రోజుల కిందట 10 పాడి గేదెలు తప్పి పోయి వచ్చాయి. ఇది గమనించిన గ్రామానికి చెందిన నాగండ్ల యలమందరావు అనే రైతు తన రక్షణలో ఉంచారు. గేదెలకు సంబంధించిన వ్యక్తులు ఎవరూ ఇంత వరకు రాలేదని, గేదెలు పోయిన వారు వస్తే అప్పగిస్తానని యలమందరావు తెలిపారు. మూడు రోజుల నుంచి తాను గేదెలను పొలానికి తీసుకెళ్లి ఇంటికి తెస్తున్నట్లు చెప్పారు.

నేడు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

మార్టూరు, జూలై 6 : స్వర్గీయ ఏలూరి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం సేవా అగ్రి గ్రూప్, ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శనివారం కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. లక్ష మంది పేదలకు కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నియోజకవర్గంలో చేపట్టిన బృహత్తర కార్యక్రమంలో ఇప్పటికే కొన్ని వేలమందికి కంటి ఆపరేషన్లు చేయించారు. అందులో భాగంగా ఆదివారం జరిగే కంటి వైద్య శిబిరాన్ని మార్టూరు ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. పరీక్షలు అనంతరం ఆపరేషన్‌లు అవసరమైనవారికి శంకర కంటి ఆసుపత్రిలో చేయిస్తారని తెలిపారు.

ఆరు వాహనాలకు పెనాల్టీ

బల్లికురవ, జూలై 6 : సరైన పత్రాలు లేకుండా ఓవర్ లోడ్‌తో రవాణా చేస్తున్న ఆరు వాహనాలకు శనివారం బాపట్ల రవాణాశాఖాధికారి ప్రసన్నకుమారి పెనాల్టీలు విధించారు. వీర్ల కొండ నుంచి గ్రానైట్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్న గ్రానైట్ ముడి రాయి లారీలను తనిఖీ చేసిన రవాణా అధికారి రూ.1.50లక్షల పెనాల్టీలను విధించారు.



అభివృద్ధి పథంలో ముందుకు సాగుదాం

ఎమ్మెల్యే కొండయ్య, ఎంపీ కృష్ణప్రసాద్

వేటపాలెం(చీరాల), జూలై 6 : వ్యాపార వర్గాలకు అన్ని విధాలా అండగా ఉంటాం. అభివృద్ధి పథంలో ముందుకు సాగుదామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. జీడిపప్పు వ్యాపారుల అసోసియేషన్ వారి ఆహ్వానం మేరకు శనివారం వారు నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే, ఎంపీలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా వెంటనే తాము స్పందిస్తామన్నారు. వ్యాపారపరంగా జీడి పరిశ్రమ పురోగమనానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించేందుకు సహకరిస్తామన్నారు. వారి సమస్యలను, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం

ఆర్యవైశ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే కొండయ్య, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ చెప్పారు. స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన కల్యాణ మండపంలో శనివారం ఆర్యవైశ్యుల ఆహ్వానం మేరకు ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే, ఎంపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు వ్యాపారపరంగా లేదా వ్యక్తిగతంగా ఏ సమస్య వచ్చినా యుద్ధప్రాతిపదికన పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపారులు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్పంచ్, కార్యదర్శిపై విచారణకు ఆదేశం

- ఎమ్మెల్యే ఏలూరి సిఫారసుపై కలెక్టర్ స్పందన
- 12లోపు నివేదిక ఇవ్వాలని జిల్లా అధికారులకు ఉత్తర్వులు

కుంకులమర్రు(పర్చూరు), జూలై 6: కారంచేడు మండలం కుంకలమర్రు సర్పంచ్, కార్యదర్శులపై విచారణకు ఆదేశిస్తూ జిల్లా గ్రామ పంచాయతీ అధికారి దాసరి రాంబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కుంకలమర్రు గ్రామంలో మంచిటి సరఫరాలో అవినీతి జరిగిందని గ్రామస్థులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకువచ్చారు. అప్పటి టీడీపీ హయాంలో ప్రజల మంచినీటి అవసరాల కోసం ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక దానిని దౌర్జన్యంగా మూసివేయించారు. తదుపరి జువ్వా చారిటబుల్ ట్రస్టు ద్వారా మంచినీటిని సరఫరా చేస్తామని చెప్పి మోసం చేశారు. ఈ విషయాన్ని గ్రామస్థులు ఏలూరి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఏలూరి కలెక్టర్ వెంకటమురళికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పందించిన కలెక్టర్ విచారించి 12లోపు నివేదిక ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారి రాంబాబుకు ఆదేశాలు జారీ చేశారు. చీరాల డివిజనల్ పంచాయతీ అధికారిని విచారణ అధికారిగా నియమిస్తూ జిల్లా అధికారి ఉత్తర్వులు ఇచ్చారు.

సైన్స్ ల్యాబ్‌కు విరాళం

సేవా కార్యక్రమాలు ముమ్మరం చేసిన కిరణ్ రీసెర్చ్ ఫౌండేషన్

మేదరమెట్ల, జూలై 6 : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రయోగశాలకు బీమని శ్రీనివాస్ రూ.36వేలు విరాళాన్ని ఇచ్చారు. శనివారం కొరిశపాడు మండలంలోని దైవాలరావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రయోగశాలకు విరాళం అందించారు. గ్రామానికి చెంది ప్రస్తుతం అరుణాచలంలో నివాసం ఉంటున్న బీమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోరిక మేరకు పాఠశాలలోని సైన్స్ ల్యాబ్ అభివృద్ధికి విరాళాన్ని అందజేశారు. గ్రామంలో విద్యాభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడు ఉంటుందని శ్రీనివాస్ తన సందేశాన్ని పంపారు.

కిరణ్ జ్యోతి రూరల్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు ముమ్మరం చేశారు. రీసెర్చ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందెపు రాజశేఖర్ ఇచ్చిన పిలుపు మేరకు సేవా కార్యక్రమాలను చేపట్టడానికి పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. రాజశేఖర్ స్వయంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రక్షిత మంచినీరు తాగడానికి వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు అండగా ఉండడంతో పాటు ఆయా సబ్జెక్టులలో నిపుణులైనవారిని తీసుకువచ్చి విద్యార్థులకు అవగాహనా సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. రాజశేఖర్ గ్రామంలో చేస్తున్న సేవా కార్యక్రమాలకు గ్రామానికి చెంది ఉన్నత స్థానాలల్లో ఉన్న పలువురు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ముందుకు వస్తున్నారు. గ్రామస్థులు సహకారంతో భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని రాజశేఖర్ తెలిపారు.

వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యం

చినగంజాం, జూలై 6 : వ్యక్తిగత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని సంతరావూరు పీహెచ్‌సీ వైద్యాధికారి బి.నాగేంద్ర అన్నారు. మండలంలోని సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది డయేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలుషిత ఆహారం, నీరు వల్ల అతిసార వస్తుందని తెలిపారు. ఓఆర్ఎస్ ప్యాకెట్స్, జింక్ ట్యాబెట్లు ద్వారా వ్యాధిని అరికట్టవచ్చునని డాక్టర్ సూచించారు. కాచి చల్లార్చిన నీటిని, వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. వ్యాధి లక్షణాలు కనబడితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెలియపరిచి చికిత్స చేయించుకోవాలని తెలిపారు. గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తూ అతిసార వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో యు.వెంకటరమణ, హెచ్‌ఈ మాధవి, ఫార్మసిస్ట్ శ్రీలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ సుధా, హెల్త్ అసిస్టెంట్ జి.విజయప్రసన్న, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

నూతలపాడు(పర్చూరు), జూలై 6 : సీజనల్ వ్యాధుల దృష్ట్యా పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. పర్చూరు మండలం నూతలపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.హరిప్రసాద్ నేతృత్వంలో శనివారం మురుగు కాలువలను శుభ్రం చేయించడంతోపాటు, మురుగు నీరు నిల్వ ఉండకుండా పనులు చేపట్టారు. దోమలు ప్రబలకుండా కాలువల్లో ఆయిల్ బాల్స్‌ను పిచికారీ చేయడంతోపాటు ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

బాబూజగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి


జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్నర్పి ప్రతినిధులు

అద్దంకి, జూలై 6 : మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూజగజ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం పట్టణంలోని కట్టకిందపాలెంలో ఆయన విగ్రహానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో జగ్జీవన్ చిత్రపటానికి రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, దళిత సంఘాల నేతలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ ఎస్సీ సెల్ నేతలు ఎంజే స్టాలిన్, దేవసహాయం, పూనూరి నరేంద్ర పాల్గొన్నారు. అనంతరం మంత్రి కట్టకింద పాలెంలో ఇటీవల మృతి చెందిన గాలి లక్ష్మీనారాయణ, గాలి నాగేంద్రమ్మ కుటుంబాల సభ్యులను రవికుమార్ పరామర్శించారు. పట్టణంలోని కాకానిపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న పాపారావును మంత్రి రవికుమార్‌ను పరామర్శించారు.

చీరాలటౌన్ : మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అప్పుడే అన్ని ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ప్రతినిధులు అన్నారు. శనివారం పట్టణంలో బాబూజగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ముక్కోణం పార్క్ కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ సేవలను గుర్తు చేస్తూ కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య, వందనం, రమేష్, మత్తయ్య, జగదీష్, అప్పారావు, చిరంజీవి, రమేష్ పాల్గొన్నారు.

ఇంకొల్లు : టీడీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాలేరు రామకృష్ణ, కరి శ్రీనివాసరావు, వలేరు మార్కు, బోడావుల శివయ్య, బీసీ నాయకులు వడ్లమూడి సాంబయ్య, ఎస్సీ నాయకులు బొతుల రాజేష్, మీరావలి పాల్గొన్నారు.